ప్రజాపక్ష

సమీక్ష

ఏప్రిల్ 16 - 30, 2003 సమతా పబ్లికేషన్స్ ప్రచురణ వెల రు. 5-00

లోపలి పేజీల్లో.....

వార్షిక చందా రూ॥ 120/-లు

Edited, printed and published by
V. Hanumantha Rao
for **Samata Publications**
D.No. 8-3-898/22, Road No.3,
Nagarjuna Nagar,
Hyderabad - 500 073.
Phone : 23748672

DTP at : Sri Sai Shamili Graphics
Golnaka, Hyd. Ph. 2756 9274

Printed at : Charita Graphics
Chikkadpally, Hyderabad - 020.

సంపాదకీయం :

సామ్రాజ్యవాద పంజాను ఉత్తుత్తి నిరసన నివారించగలదా?

అంగబలం, అర్థబలం అపారంగా గల ఒక దేశపురాజు తనతో ఎందులోనూ సరితూగని చిన్నా, చితక రాజ్యాలపై దండెత్తడం ద్వారా లోబరుచుని కీలుబొమ్మ ప్రభుత్వ పాలన సాగించిన చరిత్ర సంఘటనలను కథలుగా చదివిన మన తరానికి అలాంటి సంఘటనలను ప్రత్యక్షంగా చూసే అవకాశం వచ్చింది. ఇక ఆ పాలనలో మగ్గే అనుభవమే తరువాయి. నాటి చరిత్రకు రాజ్యవిస్తరణ కాంక్ష ప్రధాన లక్ష్యమైతే, నేటి దాడులకు వ్యాపార ప్రయోజనాలకోసం మార్కెట్లే ప్రధాన లక్ష్యం.

పెట్టుబడిదారి వ్యవస్థ తొలిదినాల్లో లాటిన్ అమెరికా, ఆఫ్రికా, దక్షిణాగ్నేసియా దేశాల్లో వ్యాపారావసరాల కోసం వలస వచ్చిన ఐరోపావాసులు, వ్యాపారంలో స్థిరపడుతూ రాజకీయ జోక్యం ద్వారా స్థానిక రాజరికాల్ని కూల్చి పూర్తి వలసలుగా మార్చుకున్నారు. వందల ఏళ్ళపాటు వలస పాలనలో మగ్గిన దేశాలు సుదీర్ఘ పోరాటాల ద్వారా వలస విముక్తి పొందాయి. ఇందుకు రష్యాలో పెట్టుబడి దారి వ్యవస్థను సవాలు చేస్తూ ఏర్పడ్డ ప్రత్యామ్నాయ ఆర్థిక నిర్మాణమైన సోషలిస్టు వ్యవస్థ కూడా తోడ్పడింది. అయితే నూతన వ్యవస్థ నిర్మాణంలో తప్పటడుగులు వేసిన నాయకత్వ వైఫల్యం కారణంగా తిరిగి పెట్టుబడిదారి గమ్యానికే తన నడకను కొనసాగించి చివరికి కూలిపోయింది. ఇక పెట్టుబడిదారి విధానానికి అడ్డేలేకపోయింది. మరో యాభై ఏళ్ళ తర్వాత ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలతో అది మరింత బలపడింది. అది తన అత్యున్నత విశ్వరూపమైన సామ్రాజ్యవాద దశకు చేరి, గత రాజరిక వ్యవస్థలో వలే దండెత్తడం ద్వారా దేశాలను వశపరుచుకుంటున్న దశకు చేరడం, వలసలుగా మార్చుకునే దాని విధానంలో జరిగిన అభివృద్ధి. దాని నిన్నటి దాడిలో అఫ్ఘనిస్తాన్‌ను, నేటి దాడిలో ఇరాక్‌ను ఆక్రమించిన ఘటనలు ఈ పరిణామానికి ప్రారంభ ఉదాహరణలు.

అయితే నిన్నటి వలస దేశాలకు అంతకు ముందు వలస విధానంలో మగ్గిన అనుభవం లేదు. వలన విధానంలో మగ్గిన బానిస అనుభవం నేడు అనేక ప్రపంచదేశాలకుండగా, తమ కళ్లెదుటే బరి తెగించిన సామ్రాజ్యవాదం బలహీన దేశాలను నిష్కారణంగా కబలిస్తుంటే చేష్టలుడిగిన నిష్క్రియా పరత్వం తమకూ ప్రమాదమేనని, బడుగుదేశాలు గుర్తించి, సామ్రాజ్యవాదాన్ని చావుదెబ్బకొట్టే విధంగా క్రియాశీల సంఘటిత ప్రణాళికను అమలు పర్చాలి. సామ్రాజ్యవాద దురాక్రమణలకు వ్యతిరేకంగా ప్రకటనలకే పరిమితమైతే ప్రయోజనం లేదని, ఇరాక్ ద్వారా రుజువైంది.

మొత్తానికి *21* రోజుల దాడి అనంతరం అనుకున్న లక్ష్యాన్ని అనుకున్నట్లుగా సాధించు కోవడంలో సామ్రాజ్యవాద శక్తులు సఫలమయ్యాయి. ఇది సామ్రాజ్యవాదం తాత్కాలిక గెలుపు కాగా, దానికి వ్యతిరేకంగా యావత్ ప్రపంచ ప్రజ యుద్ధపర్వానికి సిద్ధమైతుంది. ఇక సామ్రాజ్యవాద ఓటమి ఖాయం.

వివిధ సెక్టార్ల వారీగా రాష్ట్రంలో 1.1.2003 నాటికి ఉన్న ఉద్యోగ ఖాళీలు

సెక్టారు వారీగా	క్యాడర్ పోస్టులు	గెజిటెడ్	నాన్-గెజిటెడ్	క్లాస్ IV	ఇతరులు	మొత్తం ఖాళీలు
రాష్ట్ర ప్రభుత్వం	137	11,702	58,906	18,296	6,200	95,241
జ్యుడిషియరీ	0	112	640	330	31	1,113
ఎయిడెడ్ విద్యా సంస్థలు	0	909	8,236	408	126	9,679
జిల్లా ప్రజా పరిషత్‌లు	1	651	3,869	1,716	502	6,739
మండల ప్రజా పరిషత్‌లు	0	158	6,613	2,114	1,504	10,389
గ్రామ పంచాయతీలు	0	18	875	1,068	434	2,395
మున్సిపల్ కార్పోరేషన్స్	1	31	3,522	2,879	54	6,487
మున్సిపాలిటీలు	1	285	2,159	1,644	438	4,527
పట్టణాభివృద్ధి సంస్థలు	0	30	148	62	48	288
వ్యవసాయ మార్కెట్ కమిటీలు	0	15	193	183	48	439
జిల్లా గ్రంథాలయ సంస్థలు	0	0	409	281	288	978
ప్రభుత్వ రంగ సంస్థలు	5	1,458	10,950	12,261	11,939	36,613
విశ్వవిద్యాలయాలు	0	877	1,385	252	665	3,179
సహకార సంస్థలు / ఇతర ప్రభుత్వ సంస్థలు	0	535	4,068	15	2,192	6,810
దేవాలయాలు	0	10	2,870	300	826	4,006
మొత్తం	**145**	**16,791**	**1,04,843**	**44,925**	**22,179**	**1,88,883**

సెక్టార్ల వారీగా 1.1.2003 నాటికి రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులు

సెక్టారు వారీగా	క్యాడర్ పోస్టులు	గెజిటెడ్	నాన్-గెజిటెడ్	క్లాస్ IV	ఇతరులు	మొత్తం ఖాళీలు
రాష్ట్ర ప్రభుత్వం	505	43,127	2,71,846	76,409	1,45,723	5,37,610
జ్యుడిషియరీ	39	1,100	8,128	4,803	297	14,367
ఎయిడెడ్ విద్యా సంస్థలు	0	5,955	30,329	2,299	477	39,060
జిల్లా ప్రజా పరిషత్‌లు	6	4,534	63,743	7,127	8,234	83,644
మండల ప్రజా పరిషత్‌లు	0	1,747	1,48,363	5,656	11,966	1,67,732
గ్రామ పంచాయతీలు	0	45	5,166	4,693	8,229	18,133
మున్సిపల్ కార్పోరేషన్స్	10	371	8,774	15,299	1,247	25,701
మున్సిపాలిటీలు	0	1,154	10,585	14,093	2,766	28,598
పట్టణాభివృద్ధి సంస్థలు	6	81	695	307	502	1,591
వ్యవసాయ మార్కెట్ కమిటీలు	0	145	2,499	1,309	442	4,395
జిల్లా గ్రంథాలయ సంస్థలు	0	3	1,379	636	727	2,745
ప్రభుత్వ రంగ సంస్థలు	48	9,094	1,25,653	30,528	1,27501	2,92,824
విశ్వవిద్యాలయాలు	3	4,326	8,789	7,761	4,631	25,510
సహకార సంస్థలు / ఇతర ప్రభుత్వ సంస్థలు	90	2,555	19,888	7,487	591	31,011
దేవాలయాలు	8	52	6,120	7,667	3,512	17,359
మొత్తం	**715**	**74,689**	**7,11,957**	**1,86,074**	**3,16,074**	**12,90,280**

(ఆంధ్రప్రభ సౌజన్యంతో)

అమెరికా దాడిలో ఇరాక్ ఓడితే అది సామ్రాజ్యవాదం గెలుపుకాదు

- వి. శ్రీహరి

ప్రపంచ ప్రజల్లో నోరు విప్పి, అభిప్రాయం చెప్పగలిగిన వారిలో అత్యధికులు అమెరికా ఇరాక్‌పై ప్రకటించిన యుద్ధాన్ని నిరశిస్తున్నారు. అమెరికాతో చేతులు కలిపే ప్రభుత్వాలుండే దేశాల్లో తీవ్ర నిరసన వ్యక్తమైంది. అమెరికా దూకుడును ఐక్యరాజ్య సమితి అడ్డుకోలేకపోయింది. అమెరికా వియత్నాం యుద్ధ సమయంలో కూడ ఇంత ఒంటరి పాటు కాలేదు.

అయినా అమెరికా యుద్ధానికే సిద్ధమైంది. ఇదంతా చమురు నిక్షేపాలపై పెత్తనం కోసం అని ప్రపంచమంతా ఘోష పెడుతోంది. అది నిజం కూడా. కాని ఇరాక్ యుద్ధానికి అది ఒక కారణం మాత్రమే.

పశ్చిమ ఆసియాను తలదన్నేలా కాస్పియన్ సముద్ర బేసిన్‌లో నిక్షేపాలు వున్నట్లు అనుకుంటున్నారు. ఆ నిక్షేపాలు ప్రైవేట్ ఆస్తి. బహుళ జాతి సంస్థలు వాటిని కబళించడం సులభం. 60 బిలియన్ డాలర్ల పెట్టుబడి అవసరమనేది ఒకటే అడ్డంకి. అయినా డిమాండ్ వుంటే చాలు, కాగితాలు ముద్రించి, "ఇవే డాలర్లు కొనుక్కు చావండి" అనేంత డాష్టీకంగా వుంది డాలర్ మహత్యం. అందువల్ల నిక్షేపాల మీద ఆధిపత్యం ఒక్కటే ఈ యుద్ధానికి కారణం కాదు.

సోవియట్ పతనం తరువాత ఏకధృవ ప్రపంచం ఏర్పడిందనే భ్రమలు ప్రపంచాన్ని కమ్మివేశాయి. పెట్టుబడిదారీ ప్రపంచ సిద్ధాంతవేత్తలు తాము నమ్మి, ప్రపంచానికి అమ్మిన భ్రమలు అవి. అమెరికా సైనిక శక్తి, కెమికల్, ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ, బయో టెక్నాలజీ పరిశ్రమలలో ఆదేశానికి ఏర్పడిన ఆధిక్యత, ఆ దేశ కరెన్సీ పెత్తనం కలిపి చూసి ఈ భ్రమలు వారు ఏర్పర్చుకుని ఇతర దేశాల్లో పాదు కొల్పారు. వాటిని నిజం చేసుకునేందుకు ప్రపంచ బ్యాంక్, ఐ.ఎం.ఎఫ్‌ల లక్ష్యాలను మార్చారు. ఆక్టోపస్ వంటి ప్రపంచ వాణిజ్య సంస్థను సృష్టించారు. ఈ సంస్థల ద్వారా అమెరికా పెత్తనాన్ని పరోక్షంగా ప్రపంచమంతటా విస్తరించాలనే ప్రయత్నం ముమ్మరం చేశారు.

పెట్టుబడిదారీ విధానానికి కొన్ని సహజ లక్షణాలు వున్నాయి. అందులో ఎల్లలులేని ప్రపంచ వాణిజ్యం ఒకటి. స్వదేశంలో పరిశ్రమలకు కావలసిన భూగర్భనిక్షేపాలు కుదించుకపోయి రోజు రోజుకు అవసరం పెరిగే కొలదీ, ఇతర దేశాల మీద ఆధారపడక తప్పదు. పెట్టుబడిదారీ వ్యవస్థ సరుకుల మార్కెట్ల కోసం పోటీ ఘర్షణతో దాని వినాశం తప్పక పోవడం అనేది తిరుగులేని సిద్ధాంతం. సోవియట్ యూనియన్ సోషలిస్టు ప్రపంచం ఏర్పడ్డాక తనను తాను కాపాడుకునేందుకు ఆ లక్షణాలలో "వాడి"ని మాత్రం తగ్గించుకోగలిగింది కాని, అసలు లక్షణాలు అది పోగొట్టుకోలేదు.

రెండవ ప్రపంచ యుద్ధం ఆ లక్షణాలకు మరికొన్ని వికృత అంశాలను చేర్చింది. సైనిక, పారిశ్రామిక బంధం ఒకటి. 'సైనిక - పారిశ్రామిక బంధం కాని పారిశ్రామిక రంగమే లేద'ని 'ఐసెన్ హోవార్' చెప్పాడు. ఆయుధాలు అమ్ముకంటే తప్ప బ్రతకలేని పరిస్థితి. స్థానిక ఘర్షణలలో మాత్రమే వుపయోగించే ఆయుధాలు అమ్ముకుంటే చాలదు. అత్యంత సాంకేతిక నైపుణ్యంతో తయారైన అధునాతన యుద్ధ సామాగ్రిని అమ్ముకోవాలి. 1991లో ఇరాక్ యుద్ధం జరిగే వరకు 'నాటో' సైన్యానికి ప్రధాన ఆయుధ సరఫరాదారు ఫ్రాన్స్ దేశం. తూర్పు యూరోప్ రాజ్యాలు సహితం ఆ కూటమిలో భాగస్వాములౌతుంటే తన ఆయుధ మార్కెట్ బాగా విస్తరిస్తుందని ఆ దేశం భ్రమపడింది. అందుకే ఆ యుద్ధానికి అమెరికాకు వంత పాడింది. కాని ఆ యుద్ధంలో అత్యధికంగా ఆయుధాలు వాడిన దేశం అమెరికా. అమెరికా వాటి శక్తి గురించి అపారంగా అసత్య ప్రచారాలు సాగించింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆనాటి ఇరాక్‌పై దాడి అమెరికా ఆయుధ పరిశ్రమకు అడ్వర్‌టైజ్‌మెంట్ క్యాంపెయిన్ అయింది. ఆ యుద్ధ ఖర్చుల్లో అమెరికా వాటా ఏడు బిలియన్ల డాలర్లు. అంటే 12 శాతం. ఆ యుద్ధంలో వాడిన ఆయుధాలతో అమెరికా ఆయుధ పరిశ్రమ అపారంగా వ్యాపారం చేసింది.

ఆ యుద్ధం తరువాత నాలుగు సంవత్సరాలలో ప్రపంచ ఆయుధ వాణిజ్యం 265 బిలియన్ డాలర్లకు చేరింది. అందులో అమెరికా వాటా 114 నుండి 190 బిలియన్ డాలర్లుగా వివిధ అంచనాలు వున్నాయి. సోవియట్ పతనానికి ముందు ప్రపంచ ఆయుధ వాణిజ్యంలో 30 శాతంగా ఉన్న అమెరికా వాటా, గల్ఫ్ యుద్ధం తర్వాత 58 శాతానికి పెరిగింది. ప్రధాన పోటీదారుడైన సోవియట్ లేదు. కాని, ఫ్రాన్స్ ఆయుధ వాణిజ్యంలో రెండవ స్థానానికి చేరుకుంది. గల్ఫ్ యుద్ధంలో సాగిన ఆయుధ ప్రచారంతో రష్యా ఆయుధ పటాటోపం పాతాళానికి పడిపోయింది. అమెరికాకు షాష్టాంగ ప్రమాణం చేసిన ఎలిస్టిన్‌ను వదిలించుకుని చైనా, ఇండియా, ఈజిప్టు వంటి తన పాత మార్కెట్లను తిరిగి సంపాదించుకునేందుకు రష్యా కృషి ప్రారంభించింది. ఆయుధ పరిశ్రమను ఎలిస్టిన్ ఉద్దేశ్యపూర్వకంగా పోటీనుండి తప్పించాడు. ఇప్పుడు ఎల్స్టిన్ లేడు. రష్యా తిరిగి పోటీ దారు ఔతోంది. అమెరికా ఆంక్షలను లెక్కచేయ కుండా సద్దాంతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంది. అది ఆయుధాలకు కూడా విస్తరిస్తే ఒకవైపు సద్దాం

సాయుధుడు కావడం, మరొకవైపు ఆయుధ వ్యాపారంలో రష్యా గట్టి పోటీదారుగా ఎదగడం తో 1994-98 సంవత్సరాల మధ్య ప్రపంచ ఆయుధ వాణిజ్యంలో అమెరికా 2 శాతం పాయింట్లు కోల్పోయింది. ఈ పరిస్థితిని నివారించేందుకు ఆఫ్ఘన్ యుద్ధం తెచ్చిపెట్టింది. కాని అది ప్రతిఘటన లేని యుద్ధం. ఆయుధ పరిశ్రమకు కొత్త అడ్వర్‌టైజ్ మెంటు కాలేకపోయింది. అమెరికా ఆయుధ వాణిజ్యానికి తోడ్పడ లేదు. అమెరికా ఆయుధ పోరాటాల ప్రదర్శన, ప్రచారానికీ, ఇరాక్ సానుకూలాంశంగా మారింది. చమురు పై ఆధిపత్యం ఎంత ముఖ్యమైన కారణమో, ఆయుధాల వాణిజ్య అవసరాలు కూడా అమెరికా దాడికి అంతే కారణం. దాడి ఇరాక్‌తో, లక్ష్యం మాత్రం ఫ్రాన్స్, రష్యాల ఆయుధ వాణిజ్యంలో పోటీని ముందుగానే నివారించడం.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన తలనొప్పులలో వలసవాద పెత్తనం పోవడం మరొకటి. కొత్తగా, అత్యధిక దేశాలలో, అధికారానికి వచ్చిన పాలకపక్షాల త్వరితగతిన పారిశ్రామికవంతం కావాలనే ఆకాంక్ష, పశ్చిమదేశాలకు ముఖ్యంగా అమెరికా యంత్ర పరిశ్రమకు అపారమైన మార్కెట్‌ను సంపాదించిపెట్టింది. నిజమే, కాని తన ప్రపంచాన్ని రక్షించుకునే ప్రయత్నంలో పతనమైన జర్మనీ, జపాన్, ఫ్రాన్స్‌లు పోటీదారులుగా ఎదిగిరావడం అమెరికాను కలవర పెడుతుంది. దానికితోడు కమ్యూనిజంను ఓడగొట్టే పవిత్ర కర్తవ్యం నెత్తిన వేసుకుంది. కాని, 'కమ్యూనిష్టు' వియత్నాంలో అమెరికా గెలిచినా మట్టి కరిపించింది.

గల్ఫ్ దేశాలు చమురు నిక్షేపాలు స్వాధీనం చేసుకొని, వాటి ధరపెంచి, పెట్టుబడిదారీ ప్రపంచపు ఉత్పత్తి ఖరీదును పెంచాయి. అంతేకాదు డాలర్‌కు పోటీగా పెట్రో-డాలర్‌ను సృష్టించాయి. ఈ మార్పు అమెరికాను అప్పుల రాజ్యంగా, అపారమైన లోటు బడ్జెట్ రాజ్యంగా, మార్చింది. దీనినుంచి బయటపడేందుకు బంగారంతో డాలర్‌కుగల సంబంధాన్ని ఏకపక్షంగా కాలదన్నిన అమెరికా, ప్రపంచానికి గల 'డాలర్ దాహాన్ని' కరెన్సీ విలువగా మార్చింది. కరెన్సీని ఒక సరుకుగా, స్పెక్యులేషన్‌ను వ్యాపార కళగా మార్చింది. తనలో పెరుగుతున్న సామ్రాజ్యవాద కాంక్షను లాభాల దాహం తీర్చేందుకు మార్గంగా ఎన్నుకున్నది.

పెట్టుబడిదారీ ప్రపంచపు ఊపిరి ప్రపంచ వాణిజ్యం. దానికి ప్రపంచం గుర్తించే ఒక కరెన్సీ, ఆ కరెన్సీ గల ఒక దేశం అవసరం. వలస దేశాలను ముఖ్యంగా భారతదేశాన్ని కొల్లగొట్టి, ఇతర దేశాలతో తన వాణిజ్య లోటు పూడ్చుకుంటూ ఈ బాధ్యతను బ్రిటన్ పౌండ్ మొదట్లో అంతర్జాతీయ కరెన్సీ పాత్రను నిర్వహించింది. ఇప్పుడు అమెరికా అలాంటి బాధ్యతను నెత్తికెత్తుకుంది. కాని వలసలు లేవు. మరొకవైపు రెండవ ప్రపంచ యుద్ధానంతరం స్వీయ వ్యవస్థ రక్షణను పటిష్టపరుచుకున్న ఫ్రాన్స్, జర్మనీలు, ఆత్మ రక్షణకు అమెరికాతో పోటీకి యూరోపియన్ యూనియన్ ఏర్పరిచాయి. యూరోను డాలరుకు పోటీగా తెస్తున్నారు. ఇది అమెరికాకు సవాలుగా మారింది. యూరోను దెబ్బతీసే ప్రయత్నం ప్రారంభించింది. సద్దాం యూరోకు ఊపిరి పోశాడు. 2000 నవంబరు 6న తన చమురు, ఆ విధంగా, తన విదేశీ వాణిజ్యం యావత్తు యూరోకు మార్చాడు. ఈనాడు యూరోకు 82 సెంట్లు మారకపు విలువ. ఈ వాణిజ్య మార్పు తరువాత యూరోకు 1.5 డాలర్లు వస్తున్నాయి. డాలర్ ప్రతిష్టతోపాటు విలువ 17 శాతం తరిగింది. 'ఒపెక్' దేశాలు డాలర్ ఆధిపత్యాన్ని కాలదన్నితే?! చమురు యూరోతో గూడ దొరకు తుంటే!? ప్రపంచంలో "డాలర్ దాహం" తగ్గితే! కేవలం సరుకుగా మాత్రమే వున్న డాలర్, సాపేక్షికంగా గట్టి ఆర్థిక విధానంగా వున్న యూరోపియన్ యూనియన్‌తో పోటీగా నిలబడగలదా?

రెండవ ప్రపంచ యుద్ధానంతరం పెట్టుబడిదారి వ్యవస్థ అభివృద్ధిలో రసాయన పరిశ్రమ అభివృద్ధి కీలకమైన మలుపు. బయోటెక్నాలజీ కలసి దానికి మరింత తోడ్పాటునందించింది. ఇది కెమికల్స్‌తో గోతాలు తయారుచేసే జూట్ మీద ఆధారపడటం తగ్గడానికి కారణం అయ్యింది. ప్లాస్టిక్‌తో నిత్యజీవితంలో, సిరామిక్స్‌తో యంత్ర పరిశ్రమలో, పెట్రోలియం ఉత్పత్తులతో బొగ్గు అవసరం తగ్గించి మూడవ ప్రపంచపు దేశాల భూగర్భ నిక్షేపాలపై పెట్టుబడీదారి దేశాలు ఆధారపడడం తగ్గించుకున్నాయి. కాని అదే రసాయనం సృష్టించిన ఎరువులు, క్రిమి సంహారాలు, విత్తన పరిశ్రమ కలసి తాము పండించే ఆహారధాన్యాల ఉత్పత్తిని విపరీతంగా పెంచాయి. దానితో పెరుగుతున్న తన వ్యవసాయ వుత్పత్తులను ఎగుమతి చేసుకోవడం కష్టమైపోయింది. సమాధానం ప్రపంచ వాణిజ్య సంస్థ అని అమెరికా భావించింది. ప్రపంచం తనకు ద్వారాలు తెరవాలని కోరుకుంది. ఇందుకు అత్యధిక మూడవ ప్రపంచ అధికారవర్గాలు వారి స్వార్థ ప్రయోజనాల కోసం తలూపుతున్నాయి. ప్రజల బ్రతుకులు సమిధ లౌతున్నాయి. నిద్రాణమైన మూడవ ప్రపంచ బడుగు జీవులు ఆత్మహత్యలు, ఆకలి చావులతో విసిగి ఎవరి ప్రేరణ కోసమో ఎదురు చూడకుండా తోచిన పద్ధతిలో అమెరికా దుర్మార్గాన్ని ప్రతిఘ టిస్తున్నారు.

ఆ ప్రతిఘటనను మొగ్గలోనే తుంచడం ఇప్పటి యుద్ధ లక్ష్యం. కానీ సామ్రాజ్యవాదం వలస వ్యతిరేక ఉద్యమ రోజులను మించి, రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో కూడ ఎదురుకాని కార్మిక వర్గ ప్రతిఘటనను ఎదుర్కొంటుంది.

సియాటిల్ నుండి ప్రారంభమైన 'గ్లోబలీకరణ' వ్యతిరేక పోరాటం అమెరికా యుద్ధోన్మాదానికి వ్యతిరేక ప్రదర్శనలుగా గూడ మారుతోంది. ఈ యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు అనేక ప్రభుత్వాల ఊగిసలాటలను ఆపి, యుద్ధానికి వ్యతిరేకులుగా నిలబెడుతున్నది.

యుద్ధ ప్రయత్నాల ప్రారంభం నుండి యుద్ధం ప్రారంభం నాటికి ఎంతో మార్పు చెందాయి. "సంక్షోభ సమయం ప్రజలకు వెయ్యి పాఠశాలల పెట్టు" అన్నారు లెనిన్.

యుద్ధ వ్యతిరేకత, గ్లోబలైజేషన్ వ్యతిరేకత మిళితమై 21వ శతాబ్దపు సామ్రాజ్యవాద వ్యతిరేక సమరపు వైతాళికుడు కావచ్చన్న అయెజిజ్ అహమ్మద్ అభిప్రాయానికి ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు నిదర్శకంగా నిలుస్తాయి. ❒

అర్బన్ బ్యాంకులని వూబిలోంచి ఎలా లాగాలి?

- బెహరా ఎర్రంరాజు

చార్మినార్ బ్యాంకు పునరుద్ధరణ ప్రయత్నం ప్రారంభ దశలోనే వాసవి బ్యాంకు మూతపడింది. వాసవి బ్యాంకును తెరిచే ప్రయత్నం ఓ కొలిక్కిరాకముందే 83 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రుడెన్షియల్ బ్యాంకు లావాదేవీలు డిపాజిటర్ల సొమ్ము భద్రతకు గండివేశాయి. మున్ముందు ఎన్ని అర్బన్ బ్యాంకులు మూతపడతాయో తెలియదు. సుమారు 18 నెలల క్రితమే రాష్ట్రంలో అర్బన్ బ్యాంకుల పరిస్థితిని సమీక్షించి ప్రభుత్వం ఏర్పరచిన కమిటీ కనీసం 16-17 అర్బన్ బ్యాంకుల ఆర్థిక అలసత్వాన్ని విశదీకరించి వాటిపై తగిన చర్య తీసుకోవాలని సూచించినా, అటు రాష్ట్ర ప్రభుత్వం ఇటు రిజర్వు బ్యాంకు ఎందుకు నిర్లిప్తంగా వున్నాయో తెలియడం లేదు. తీగలాగితే డొంకంతా కదుల్తుంది.

ఈ అర్బన్ బ్యాంకులను రాష్ట్ర ప్రభుత్వం సహకార శాఖ, రిజర్వుబ్యాంకు కూడా ఆడిట్ చేస్తాయి. ఈ ఆడిట్ రిపోర్టులో సూచించిన లోపాలను సవరించి బ్యాంకులు నివేదికను నిర్ణీత కాలంలో నియంత్రణాధికారులకి పంపాల్సి ఉండగా ఈ సవరణ నివేదికలు ఏ అర్బన్ బ్యాంకు, కేంద్ర సహకార బ్యాంకు సకాలంలో పంపడంలేదు. కాని సవరణలు జరగడంలేదు. దానికి సహకార రిజిస్ట్రారు వారి కార్యాలయంలో వుద్యోగులు కనీసం మూడొంతుల మేరకు ఈ సహకార బ్యాంకుల్లో ఏదో రూపమైన అప్పులుండడం మొదటి కారణం. కంచే చేనుమేస్తే చేసేది ఏముంది? దీనికి పరిష్కారం లేదా? ఉంది. అమలు జరప డానికి రిజిస్ట్రారు కార్యాలయంలో చిత్తశుద్ధి కావాలి. ప్రతీ ఉద్యోగిని డిసెంబరు నెలాఖరుకి ఏ బ్యాంకులో ఏ హామీ/పూచీకత్తుపై ఎంత అప్పు ఏ నిబంధనలపై తీసుకున్నది, ఎలా వాపసు చేస్తున్నది ఒక సర్టిఫికేటు రూపంలో తీసుకోవాలి. దానిపై వాకబు చేసి అది ఆ ఉద్యోగి చెల్లింపుశక్తికి అనుకూలంగా వుందా లేదా అని ఆరాతీసి, తత్సంబంధిత బ్యాంకులు ఆడిట్ చేసేటప్పుడు ఆ ఉద్యోగిని పింపించకుండా చూడాలి. అసలు బ్యాంకుల్లో ఆడిట్‌చేసే వుద్యోగులెవ్వరికి అర్బన్ కేంద్ర సహకార బ్యాంకుల్లో అప్పులు తీసుకోవడం నేరాలుగా పరిగణించి తత్సంబంధిత వ్యక్తులపైనా అధికారులపైన క్రమశిక్షణా చర్యలు తక్షణం తీసుకోవాలి.

ఇదే విధంగా రిజర్వుబ్యాంకు వార్షిక నివేదికలో సూచించిన లోపాలను ఏ అర్బన్ బ్యాంకు అయినా సవరించని పక్షంలో మరుసటి సంవత్సరం ఆడిట్ పటిష్టం చేసి బ్యాంకు అధికారుల పైనా, బ్యాంకుపైనా క్రమశిక్షణ చర్య తీసుకోవాలి. అప్పుడే నియంత్రణకు అర్థం వుంటుంది.

అర్బన్ బ్యాంకులు స్వల్పాదాయ మధ్యతరగతి వ్యక్తుల వ్యవస్థల పొదుపుసమాఖ్యలు. అటువంటప్పుడు అవి ఇచ్చే రుణాలపై గరిష్టపరిమితులు అవసరం. ఏ అర్బన్ బ్యాంకు ఏ వ్యక్తికి గాని, ఏ సంస్థకైనాగాని కోటిరూపాయలు దాటి అప్పు ఇవ్వకూడదు. ఓవర్ డ్రాఫ్ట్ అన్నది స్వల్పకాల రుణం. మహా అయితే 24 నెలల్లో పూర్తి చెల్లింపు అవ్వాలి. నెల నెలా వాయిదాలు నిర్దేశించాలి. ఇవేవి కాకుండా సినిమా సంస్థలకి కంట్రీ (కంతిరీ) క్లబ్‌లకి 10 నుంచి 40 కోట్ల రూపాయలకి అప్పులెలా ఇచ్చారు? ఇచ్చిన అప్పులు నెల నెలా వాయిదాల ప్రకారం వసూలు చేయకుండా నిర్లిప్తంగా తత్సంబంధిత బ్యాంకు బోర్డు డైరక్టర్లు ఎందుకు వున్నారు? 200 శాతం మేరకు హామీ తీసుకున్నారని ప్రుడెన్షియల్ బ్యాంకు అధ్యక్షుడు చెప్పడం హాస్యాస్పదం. ఎందుకంటే కంట్రీక్లబ్‌కి 80 కోట్ల రూపాయల ఆస్తులు లేవు. అంతవిలువైన ఆస్తులున్నా తీసుకున్న అప్పులు పోను బాకీ మిగిలితే ఆ ఆస్తులని అమ్మి నగదు చేయడం ఎంతటి అధికారులకైనా దుస్సాధ్యం. రెండు నెలలు వాయిదాలు చెల్లింపులు చేయకపోతే అవి నిరర్థక ఆస్తులుగా పరిగణించే రిజర్వుబ్యాంకు అర్బన్ కో - ఆపరేటీవ్ బ్యాంకుల విషయంలో ఏం చేస్తోంది? ఇక్కడ కూడా నియంత్రణాధికారులనే తప్పుపట్టాలని వస్తుంది. ఈ అర్బన్ బ్యాంకులు, అప్పు ధరఖాస్తు దారుల స్థిరాస్తుల విలువ పెరుగుతూనే వుంటుందనే భరోసాతో అప్పు ఇచ్చేటప్పుడు వాటి విలువని పెంచేసి అప్పులిచ్చేశారు. వీటిపై ఆడిట్ రిపోర్టులలో అభ్యంతరాలు వుండే వుంటాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖ పైనుదహరించిన కారణాల వలననే నిద్రపోయింది.

మరో ముఖ్యవిషయం, ఈ రకమైన నిరర్థక ఆస్తుల, వ్యవహారాలలో లోనుగులు వాణిజ్య బ్యాంకుల్లో లేవా? వుండవచ్చు. కాని వాటి స్థాయి, సమతులం వాటికుండే సామూహికతతో ముడిపడి వుండడంతో సత్వర చర్యలవలనా అర్బన్ బ్యాంకు వ్యవహారాలలాగా గుప్పు మనలేదు.

అర్బన్ బ్యాంకుల రాష్ట్ర సమాఖ్య ఏర్పడి ఒక అర్బన్ బ్యాంకు నుంచి ఇంకో అర్బన్ బ్యాంకుకి డిపాజిట్లు కుండమార్పిడి కాకుండా వుంటే అర్బన్ బ్యాంకుల నికర అప్పులు నికర ఆస్తులు వాణిజ్య బ్యాంకులలోలాగా బ్యాంకుల సుస్థిరతకి దోహదం చేస్తాయి. దీనికి ఇటు అర్బన్ బ్యాంకులు అటు రిజర్వు బ్యాంకు ప్రత్యేక శాసనానికి పూనుకుని పరిస్థితని చక్కబరచాలి.

(మిగతా 7వ పేజీలో)

సహకార అర్బన్ బ్యాంకుల దివాళా - కారణాలు

- వి. హనుమంతరావు

ఇటీవలి కాలంలో సహకార అర్బన్ బ్యాంకులు గాలి పటాల్లా కూలిపోతున్నాయి. పాలకులకు నిద్రాభంగం కలిగింది. రాష్ట్రంలో కొన్ని బ్యాంకులు బలహీనంగా ఉన్నాయని వారు హఠాత్తుగా గుర్తించారు. లైసెన్సులిచ్చిన రిజర్వు బ్యాంకు, సహకార రిజిస్ట్రార్‌లు కూడా నిద్రపోవడం, ముఖ్యంగా మహారాష్ట్రలో మాధాపుర బ్యాంకు కుంభకోణం తర్వాత కూడా మెలకువ రాకపోవడం చూస్తే ఏ ముంద్రా కుంభకోణంలాంటిదో, హర్షద్ మెహతా వంటి కుంభకోణాలో జరిగితే తప్ప మెలకువ రానంత కుంభకర్ణ నిద్రపోతున్నారనుకోవాలి. అర్బన్ సహకార బ్యాంకులు ఇలా బోర్డులు తిప్పేసి లక్షలాది మధ్య తరగతి కుటుంబాలను కష్టాలు, నష్టాలపాలు చేయడానికి దారితీసిన కారణాలను ఈ బ్యాంకుల పని తీరు గురించి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చాలా కాలంగా, తర్వాత అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఫ్యాకల్టీగా పనిచేసిన డాక్టర్ బి. ఎర్రం రాజు విశ్లేషిస్తూ, రిజర్వు బ్యాంకే నియమించిన మాధవదాస్, మరాఠే, మాధవరావు నాయకత్వాల్లో నియమించిన కమిటీలు చేసిన సిఫార్సులను విస్మరించడమేనని అభిప్రాయపడ్డారు.

ప్రైవేటీకరణ పచ్చకామెర్ల వ్యాధిన పడిన పాలకుల కంటికి ఈ అర్బన్ బ్యాంకులు బొత్తిగా నలుసుల్లా కనపడినట్టుంది. కాని ఈ బ్యాంకులేమీ అంత చిన్నచితకావి కావు. ఈ వ్యవస్థ దేశంలో బ్యాంకింగ్ రంగంలో గమనించదగిన స్థాయిలో వున్నాయి. మార్చి 2001 నాటికి 7375 శాఖలతో 2084 సహకార బ్యాంకులున్నాయి. వాటి డిపాజిట్లు రు. 89,650 కోట్లు. అడ్వాన్సులు రు. 53,800 కోట్లు. అంటే అన్ని వ్యాపార బ్యాంకుల వ్యాపారంలో తొమ్మిది శాతం అర్బన్ బ్యాంకులే చేస్తున్నాయి. ఈ బ్యాంకుల్లో 80 శాతం మొత్తం వ్యాపారంలో 75 శాతం ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో జరుగుతుంది. 'ఒక పక్క ప్రపంచీకరణ, రెండోపక్క బలహీనమైన బ్యాంకింగ్ వ్యవస్థ - ఈ రెండూ ఒకే ఒరలో ఇమడవు. ఇది చాలా ఆందోళన కలిగించే పరిణామాలకు దారి తీస్తుంది' అని అంటారు డా. ఎర్రం రాజు.

ఆయన విశ్లేషణ ప్రకారం సాంప్రదాయంగా కుటుంబాలు నడిపే బ్యాంకులకు, ఈ సహకార బ్యాంకులకు తేడా లేదు. ఇక్కడ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సి.ఇ.వో), అక్కడ ప్రైవేటు వ్యక్తి చేతుల్లో ఈ బ్యాంకులు పనిచేస్తున్నాయి. సహకార బ్యాంకుల్లో ఈ వ్యక్తులు, వారి బంధుమిత్రులు పదిమందిని పోగేసి, ఈ బ్యాంకును స్థాపించి, డిపాజిటర్ల నిధులను వారి ఇష్టం వచ్చినవారికి రుణాలిస్తుంటారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు కొన్ని విఫలం కావడంతో, వాటిని మూసేసి, సహకార బ్యాంకుల బురఖాలు తగిలించుకొన్న సందర్భాలూ వున్నాయి. పేరుకు మాత్రం సహకార బ్యాంకుల్లో సభ్యులుంటారు. సభ్యులే నడుపుతారు. సభ్యులే బ్యాంకును డైరెక్టు చేస్తారు. కాని ఆచరణలో పెత్తనం డైరెక్టర్ల బోర్డుదే. ఆ డైరెక్టర్ల చేతుల్లో సి.ఇ.వో. కీలు బొమ్మ. వీరిపైన అధికారంలో వున్న పార్టీ కర్రపెత్తనం మరొక అంచెగా తయారైంది. ఉదాహరణకు సహకార ఉద్యమానికి జీవం పోసిన ఒక రాష్ట్రంలో, అన్ని సహకార సంఘాల, అర్బన్ సహకార బ్యాంకుల మేనేజ్‌మెంటు బోర్డులను ఒక్క కలం పోటుతో, రద్దు చేసారు. సహకార సంఘాలను పునర్వ్యవస్థీకరిస్తున్నాం బలోపేతం చేస్తున్నాం అనే ముసుగులో ఈ పని జరిగింది. కాని వాస్తవంలో కారణం ఇది కాదని, రాష్ట్రంలో ఉన్నత స్థాయిలో రాజకీయంగా వచ్చిన మార్పు వల్లనే అనేది స్పష్టం.... పునర్వ్యవస్థీకరించి, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించిన తర్వాత కూడా అర్బన్ బ్యాంకులకు మానేజింగ్ డైరెక్టర్లుగా సహకార శాఖ అధికారులను నియమించారు." అని మాధవరావు కమిటీ పేర్కొంది. బ్యాంకుల్లో రెండు రకాల సభ్యులుంటారు. బ్యాంకు నుంచి రుణం తీసుకోదలచిన ప్రతి వ్యక్తీ బ్యాంకులో సభ్యుడిగా వుండాలి. కాని అతనికి వోటింగ్ హక్కు వుండదు. షేర్‌హోల్డర్ సభ్యులకు వోటింగ్ హక్కు వుంటుంది. షేర్ హోల్డర్లే డైరెక్టర్ల బోర్డును ఎన్నుకొంటారు. పైనే చెప్పినట్లు తక్కువ మందిని షేర్‌హోల్డర్లుగా తీసుకొని బోర్డును ప్రమోటర్ తన ఇష్టం వచ్చినవారితో నింపుకొని, వారి చీకటి వ్యవహారాలు సాగిస్తారు. ఇలా జరగడంవల్ల ఒక బ్యాంకులో ఉండాల్సిన ప్రొఫెషనలిజం మృగ్యమైపోతుంది. అలాంటి ప్రవీణ్యత బ్యాంకు డైరెక్టర్లకే కాదు, వాటిని పర్యవేక్షించే సహకార సంఘాల రిజిస్ట్రార్‌కు కూడా లేదు. ఆయన బ్యాంకు చట్టం ప్రకారం లైసెన్సులివ్వడం, ఏదో పైపై పర్యవేక్షణ చేయడం, రిపోర్టులు తెప్పించుకోవడంమేరకే ఆయన కార్యకలాపాలు పరిమితం. అందుచేత బోర్డులో సభ్యత్వానికి అర్హత వుండాలంటే, అతను, అతని బంధుమిత్రులయొక్క షేర్ల మొత్తంపై కొంత పరిమితి విధించాలని డా. ఎర్రంరాజు సూచించారు. అందుకనే, ప్రతీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్లలో కనీసం ఇద్దరు బ్యాంకింగ్ నైపుణ్యం, పని విధానం తెలిసినవారిని నియమించాలని మాధవరావు కమిటీ సిఫార్సు చేసింది. అదే సమయంలో బ్యాంకును ప్రారంభించిన ప్రమోటర్లు, బోర్డు సభ్యులు ఏ ఇతర బ్యాంకుకు రుణపడి

వుండకూడదని, చిట్‌ఫండ్, నాన్-బాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ, సహకార బ్యాంకు, వ్యాపార బ్యాంకులతో ఏ స్థాయిలోనూ సంబంధం వుండకూడదని కూడా సిఫార్సు చేసింది.

మరో విషయం. ఈ బ్యాంకుల ఎకౌంట్లను సహకార శాఖ ఉద్యోగులే ఆడిట్ చేస్తున్నారు. వారికి రిజర్వు బ్యాంకు రెగ్యులేషన్స్ గురించి గాని, బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం గురించిన పరిజ్ఞానం చాలా పరిమితం. అలాంటప్పుడు వాళ్ళు చేసే ఆడిటింగ్ కూడా ఆ పరిమితులకు లోబడే వుంటుంది. సమగ్రత వుండదు. అందుచేత ఇతర బ్యాంకింగ్ కంపెనీల్లాగే ఈ బ్యాంకులు కూడా బయటనుంచి చార్టర్డ్ అకౌంటెంట్లను నియమించుకొనే అధికారం, అవకాశం ఈ బ్యాంకులకు ఇవ్వాలని మాధవరావు కమిటీ సిఫార్సు చేసింది. ఆట ఆడేవాళ్ళే అంపైర్లుగా వుండకూడదు కదా! ఈ మార్పులు, చేర్పులు ఇదివరకే చేసివుండివుంటే బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకొన్నవారికి రక్షణ వుండి వుండేది.

మొత్తం మీద అర్బన్ బ్యాంకులు ఈ దుస్థితిలో పడ్డాయంటే ఇపుడున్న చట్టాలను, రిజర్వు బ్యాంకు పర్యవేక్షణ గురించి తీవ్రమైన మార్పులు జరగాల్సివుంది. నిర్మాణం, పని తీరు లోపాలే దుస్తితికి ప్రధాన కారణాలు. వీటిని సరిచేయాలి.

బ్యాంకుల గురించి చర్చిస్తున్నాం కాబట్టి మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ గ్రామిణ ప్రజలకు ఏం చేస్తుందో చూద్దాం. ఒక పక్క నుంచి చిన్న, సన్నకారు రైతుల మీద నూతన వ్యవసాయ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే దాడికి పూనుకొంది. రెండవ పక్క బ్యాంకుల ప్రైవేటీకరణ ద్వారా కేంద్రప్రభుత్వం అదే చిన్న, సన్నకారురైతాంగాన్ని బ్యాంకులనుంచి రుణాలను తీసుకొనే వ్యవస్థనుంచి దూరం చేస్తుంది. ఈ జమిలి దాడిలో మొత్తం గ్రామీణ వ్యవస్థ కుప్పకూలి పోయే దిశగా దేశం, రాష్ట్రం పయనిస్తున్నాయి.

జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరణ చేస్తూ ప్రభుత్వమేమీ ప్రకటన చేయలేదు. అయితే, ఈ బ్యాంకుల్లో ప్రభుత్వ ఈక్విటీ 35 శాతానికి తగ్గించడానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. పొమ్మనలేక పొగపెట్టడం అంటే ఇదే.

ఇప్పటికే ప్రాధాన్యతా రంగానికివ్వాల్సిన 40 శాతం రుణాల్లో 18 శాతం ఇవ్వాల్సి వుండగా 1998 గణాంకాల ప్రకారం 10.7 శాతాన్నే బ్యాంకులు ఇస్తున్నాయి. ఒక ప్లాన్ ప్రకారం గ్రామీణ బ్యాంకింగ్ వ్యవస్థనే రద్దుచేసే పద్ధతి అమలులో వుంది. ఉదాహరణకు మార్చి 1996 నుంచి జూన్ 1999 మధ్య కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు శాఖలు 33,092 నుంచి 32,850 కు తగ్గగా, అదే సమయంలో మహానగరాల్లో శాఖలు రైతాంగం, ప్రజల అక్కౌంట్లు 1990 నుంచి 30 శాతం దగ్గరే నిలిచిపోయాయి. వారికిచ్చే రుణాలు 41 శాతం పెరగగా, పట్టణాలు, నగరాల్లో రుణాలు అంతకన్నా వేగంగా పెరిగి 51 శాతానికి చేరుకొన్నాయి. అలాగే సేవింగ్స్ ఖాతాలు 33 శాతం నుంచి 31.7 శాతానికి, వాళ్ళకిచ్చే రుణాలు 50.01 శాతం నుంచి 40.01 శాతానికి తగ్గాయి. అంటే గ్రామీణులు బ్యాంకుల్లో డిపాజిట్లు చేసిన సొమ్ములో 40.01 శాతం మాత్రమే వారికి రుణంగా ఇస్తున్నారు. అంకెల్లో చెప్పాలంటే మార్చి 1999 నాటికి గ్రామీణ ప్రాంత ప్రజలు రు. 1,02,602 కోట్లు డిపాజిట్ చేస్తే, వారికి రుణంగా ఇచ్చింది రు. 41,193 కోట్లు మాత్రమే. అదే కాలంలో పట్టణాల్లో, నగరాల్లో 64.9 శాతం, అంటే రు. 4,62,588 కోట్ల డిపాజిట్టుకు గాను రు. 3,00,038 కోట్లు రుణం ఇచ్చారు. దీనినే రుణం - డిపాజిట్ రేషియో అంటారు. గ్రామాలనుంచి, పట్టణాలకు బ్యాంకుల గాలి మళ్ళిందని పై గణాంకాలు తెలియ జేస్తున్నాయి.

అసలు వ్యవసాయానికి బ్యాంకులు, సహకార బ్యాంకులు ఇచ్చే వ్యవస్థాగత రుణమే అంతంత మాత్రం. నాబార్డ్ సంస్థ మాజీ అధ్యక్షులు శ్రీ కోటయ్య నాయకత్వంలో వ్యవసాయ రుణావసరాలకు 2002 సంవత్సరం నాటికి 2.3 లక్షల కోట్లు కావల్సి ఉండగా 1995 నాటికి ప్రభుత్వ బ్యాంకులు ఇస్తున్నది సుమారు రు. 35 వేల కోట్లు మాత్రమే. సహకార బ్యాంకులు ఇస్తున్నది ఇంకో అంత అనుకొన్నా (ప్రభుత్వ బ్యాంకుల కన్నా సహకార బ్యాంకులు తక్కువ రుణాలిస్తాయి.) అవసరాలతో పోలిస్తే మనం ఎక్కవ వున్నాం?

ఎక్కువగా వడ్డీ వ్యాపారస్తుల మీదనే ఆధారపడుతున్న పత్తి రైతాంగమే అందుకు నిదర్శనం. బ్యాంకింగ్ వ్యవస్థ అభివృద్ధి ముఖ్యంగా ఉత్తర ఈశాన్య రాష్ట్రాల్లో సుమారుగా స్తంభించి పోయింది. ఇటు బ్యాంకింగ్ వ్యవస్థ అవసరమైన మేరకు రుణాలివ్వదు. అటు ప్రభుత్వం వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించింది. మొత్తం రైతాంగంలో 70 శాతం కమతాలున్న సన్న, చిన్న కారు రైతాంగం వ్యవసాయానికి కాలవాల్సిన పెట్టుబడులూ తామే పెట్టలేరు. వాళ్ళేమి కావాలి? వ్యవసాయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎమ్.ఎస్. స్వామినాథన్ ఫ్రంట్‌లైన్ పత్రికలో రాస్తూ, చిన్న సన్నకారు రైతాంగానికి ఏ సహాయం చేసినా, అది మొత్తం రైతాంగానికే సహాయంతో సమానం అని అన్నారు. గ్రామీణ బ్యాంకింగ్ రంగం గురించి ఇలా ఎంతైనా రాయవచ్చు. ప్రభుత్వ లక్ష్యం ప్రపంచ బ్యాంకు ఆదేశాలమేరకు ప్రైవేటీకరణ చేయడం. పై చర్యలన్నీ ఆ దిశవైపుకే బ్యాంకుల్ని నెట్టుతున్నాయి. ❐

(5వ పేజీ తరువాయి)

స్వల్పకాలిక డిపాజిట్లు దీర్ఘకాలిక రుణాలు ఒక వరలో ఇమడవు. అందుచేత ప్రతీ అర్బన్‌బ్యాంకు డిపాజిట్లు సగటు పరిమితికి సమతూకంలోనే రుణ చెల్లింపు వాయిదా లేర్పరచాలి. దీనిని రిజర్వు బ్యాంకు అజమాయిషీ చేసినట్లుగా సహకార శాఖ రిజిస్ట్రారు చేయలేరు. అందుచేత అర్బను బ్యాకుల నియంత్రణాధికారం కేవలం రిజర్వుబ్యాంకు చేతుల్లోనేవుంటే ప్రస్తుత కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల వరస వైఫల్యాలకు బ్రేకు వేయవచ్చు. ❐

మత్స్య కార్మికులపై నీలి విప్లవం నీలి నీడలు

- ఇప్ప వీరన్న

నిన్నటిదాకా వాళ్ళు నమ్ముకున్న వృత్తి వాళ్లని 'సిరి' మంతుల్ని చెయ్యకపోయినా, జీవితాల్లో చింతలు నింపలేదు. ఆ వృత్తి ద్వారా ప్రతీ ఏడు జాతీయాదాయానికి ఆరువేల కోట్ల రూపాయల వాటాను సమకూరుస్తున్నా ఆ వృత్తికారులు అన్ని వృత్తుల కార్మికుల్లాగే ప్రపంచీకరణ వలలో చిక్కి విల విలలాడు తున్నారు. వాళ్లది వృత్తి అనడం కన్నా ప్రకృతి శక్తులతో 'సహస సహవాసం' అనడం సరిగ్గా ఉంటుంది. ఈదురు గాలులు, తుఫానులు, ఉప్పెనలు లాంటి భయంకరమైన ప్రకృతి వైపరీత్యాల మధ్య కొనసాగుతున్న ఆ వృత్తి ఒక మృత్యు సహవాస కార్యక్రమం. ఆ వృత్తి నిర్వహణలో నిత్యం ఇలాంటి ఎన్నో ప్రకృతి సంబంధిత భయంకర ఆటుపోట్లను అవలీలగా ఎదుర్కొన్న వాళ్లు, నేడు పెట్టుబడీ దారి వ్యవస్థ సహజ లక్షణమైన ప్రపంచీకరణ ఉప్పెన ధాటికి గిల గిల కొట్టుకుంటున్నారు. వాళ్ల బ్రతుకు గమ్యం, అగమ్య గోచరంగా మారడంతో కలవరపడుతున్నారు.

8118 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతాన్ని కలిగి ఉండి 6367 కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్న దేశ మత్స్య పరిశ్రమకు ప్రపంచ వ్యాప్తి మత్స్య ఉత్పత్తిలో 44 శాతం వాటాను చేజిక్కించుకుంది. రాష్ట్రానికి వస్తే తొమ్మిది జిల్లాల్లో 974 కి.మీ. తీరప్రాంతం, 8755 కి.మీ. నదీ తీరప్రాంతం, 152 లక్షల ఎకరాల విస్తీర్ణంతో చెరువుల, రిజర్వాయర్లనుండి సుమారు ఎనిమిది లక్షల టన్నుల చేపలు, రొయ్యల ద్వారా అయిదువేల కోట్ల రూపాయల వ్యాపారంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో 3వ స్థానంలో కొనసాగుతుంది. ఇందులో విదేశీ ఎగుమతులే 23 వందల కోట్ల రూపాయలు. ఇంతటి అపార ప్రకృతి సహజ సంపదను ప్రాణాలను పణంగా పెట్టి వెలికి తీస్తున్న మత్స్యకారుల బతుకుల్లో పెట్టుబడీ దారీ ప్రభుత్వ విధానాలు అమలు - ప్రపంచీకరణ ఫలితంగా తీవ్ర అశాంతియుత పరిస్థితులు నెలకొన్నాయి.

గత అర్ధ శతాబ్ది కాలమంతా ప్రభుత్వ అభివృద్ధి!? విప్లవాల యుగం. గతంలో హరితవిప్లవం, క్షీర (పాల) విప్లవం అయిపోయి, ఆయా రంగాల్లో సహజ సంప్రదాయ బద్ధ జీవన విధాన సంస్కృతు ల సర్వనాశనాన్ని సంపూర్ణం చేసిన తరువాత ఇప్పుడు, నిన్న మొన్నటి నీలి విప్లవం అదే స్వభావంతో అదే లక్ష్యాన్ని పూర్తి చేసింది. ప్రగతి అభివృద్ధిల ముసుగులో నూతన సాంకేతిక విజ్ఞానపు ప్రోద్బలంతో ప్రారంభమైన నీలి విప్లవం మత్స్యకారుల జీవితాలపై నీలి నీడల్ని పరిచింది. ప్రజల ఆహారంలో మాంసపుకృత్తుల లోపాన్ని సవరించి సమృద్ధిగా అందించడం అనే వంకతో మత్స్యపరిశ్రమలోకి ప్రవేశించిన మరపడవలు మత్స్యకారుల సంప్రదాయ బోట్లపై సవారీ చేస్తున్నాయి. ఈ పరిణామంతో మాంసపుకృత్తుల కొరతను తీర్చడం మాటెలా ఉన్నా సామాన్య జీవుల ఆహారంలో చేపల నలుసే కరువైంది.

మత్స్యపరిశ్రమలోకి అభివృద్ధి పేరుతో ప్రవేశించిన నూతన సాంకేతిక పరిజ్ఞానం ఫలితంగా ఒకగూరిన భారీ లాభాల ప్రయోజ నాలను దేశీయ, విదేశీ, బహుళజాతి పెట్టుబడిదారులు దక్కించు కోగా, దానివల్ల వచ్చిన నష్టాలతో అప్పటిదాకా స్వతంత్రంగా కొనసాగి అదే వృత్తిలో కూలీలుగా మారడమో, లేదా ఆ వృత్తినే వదిలేసి వలసకూలీలుగా మారడమో, లేదా ఎలాంటి పనికీ అవకాశమే లేని నిరుద్యోగులుగా మారడం వంటి ఫలితాలు సంప్రదాయ పేద మత్స్యకారుల సొంతం అయిపోతున్నాయి. రెండవ పంచవర్ష ప్రణాళికతో (1960-65) ప్రారంభమైన ఈ మార్పుపై 1990లో 'నూతన ఆర్థిక విధానాల' పేరుతో అంతర్జాతీయ పెట్టుబడుల ప్రవాహానికి (విస్తరణ) ఆటంకాలు లేని ఆర్థిక సరళీకరణ విధానాలు తీవ్ర ప్రభావాన్ని చూపెట్టాయి. సహజంగానే వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లోని అసంఖ్యాకమైన కార్మికవర్గ జీవితాల్లో పెనుతుఫాను రేపిన నూతన ఆర్థిక విధానాలు అనాదిగా, సముద్రాన్నే నమ్ముకుని చేపల వేట ద్వారా పొట్ట పోసుకుంటున్న లక్షలాది సంప్రదాయ బద్ధ మత్స్యకారుల జీవితాలను ముంచేస్తు న్నాయి. ఈ విధానాల్లో భాగంగా భారత ప్రభుత్వం, దేశీ విదేశీ బడా పెట్టుబడిదారులు, బహుళ జాతి కంపెనీల ప్రయోజనాల కోసం, మత్స్యసముద్ర ఆహారోత్పత్తితో సహా మొత్తం పరిశ్రమల్లో లైసెన్స్ విధానాన్నే ఎత్తివేసి విదేశీ పెట్టుబడికి తలుపులు బార్లా తెరిచింది.

ఇంతకుముందే 'ట్రాలర్ డెవలప్‌మెంట్ ఫండ్' షిప్ పార్మర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీలు, షిప్పింగ్ హార్బర్ల నిర్మాణం, ప్రధాన రేవు పట్టణాల వద్ద నౌకలు నిలుపుకునే సౌకర్యాలతో పాటుమత్స్య పరిశ్రమలో యాంత్రీకరణ కోసం సబ్సిడీలు, రుణాలను ప్రభుత్వం ప్రోత్సహించడం ద్వారా 1979 నాటికే సంప్రదాయ మత్స్యవేట యాంత్రీకరణ దశలోకి నడక ప్రారంభించింది. అది 1990లో నూతనార్థిక విధానాలతో సంపూర్ణమై రోజురోజుకు పెరుగుతూ వచ్చింది. దీని ప్రభావంగా దేశంలో 1990 నాటికే 22 వేలున్న మరపడవల సంఖ్య 1994-1995 నాటికి 47 వేలకు చేరుకుంది.

అదే విధంగా దిగుబడి లోను ఊహించలేని మార్పు కనబడింది. 1985-86లో 53 వేల ఐదు వందల 40 టన్నులున్న చేపల దిగుబడి పదేళ్ళ వ్యవధిలో ఒక లక్షా 33 వేల 500 టన్నులకు పెరిగింది. గమనించాల్సిన విషయం ఏమిటంటే ఈ మొత్తం ఉత్పత్తిలో మరపడవలు విదేశీ, స్వదేశీ కాంట్రాక్టర్లల్ల వాటా 47.5 శాతం నుండి 66.7 శాతానికి పెరుగగా, సంప్రదాయ మత్స్యకారుల వాటా మాత్రం 52.5 శాతం నుండి 33.4 శాతానికి పడిపోయింది. అదే విధంగా ఎగుమతులూ పెరిగాయి. 1961-62లో 15,732 టన్నులున్న ఎగుమతులు, 1999-2000 నాటికి 3,43,031 టన్నులకు పెరిగింది. విలువలో చెప్పాలంటే 1990-91లో రు. 960 కోట్ల విలువల గల 159వేల టన్నుల మత్స్య సంబంధమైన ఎగుమతులు 1998-99లో రు. 4369 కోట్ల విలువగల 311 వేల టన్నులకు చేరుతున్నాయి. ఇలా ఎన్ని కోట్ల రూపాయల ఎగుమతులు పెరిగినా మత్స్యకారుల బతుకులు కూటికి పడుతున్న అవస్థలు అంతకు అనేక రెట్లు ఎక్కువయ్యాయన్నది చేదు నిజం అభినవ అభివృద్ధి నిర్మాతల తలకెక్కదు.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పదిలక్షల రూపాయలు అంతకుపైగా విలువచేసే మరపడవలు, ట్రాలర్లు తీరం నుండి 22 కిలోమీటర్ల వరకు గల సముద్ర ప్రాంతంలో వేట చేయకూడదన్న నిబంధనను ఉల్లంఘించి కొనసాగిస్తున్న చేపల వేట కారణంగా ఆ ప్రాంతంలో (22 కి.మీ.ల లోపు సముద్రంలో) నాటు పడవలతో వేట చేస్తున్న సంప్రదాయ మత్స్యకారులకు చేపల లభ్యత గణనీయంగా తగ్గిపోయింది. 6-8 మంది కార్మికులతో వారం రోజుల పాటు మరపడవల ద్వారా చేసిన వేటలో 90 వేల నుండి లక్షా 20వేల రూపాయల విలువచేసే చేపలు (ప్రధానంగా రొయ్యలు) లభ్యమవుతుండగా, పదివేల రూపాయల లోపు విలువ చేసే సంప్రదాయ బోట్లపై ఏరోజుకారోజు వేటకు వెళుతున్న పేద స్వతంత్ర మత్స్యకారులకు లభించే చేపల విలువ 100 రూపాయలకు మించి ఉండవు. అంటే ఒక స్వతంత్ర మత్స్యకారునికి తన నాటు పడవ (ముగ్గురికి కలిపి) ఖర్చులు పోను వంద రూపాయలు కూడా గిట్టడం లేదన్నమాట. రోజువారి కుటుంబ అవసరాలకోసం అంతకుముందే వడ్డీ వ్యాపారస్తుల వద్ద అప్పుచేసిన వీళ్ళు, తమ వేట ద్వారా లభించిన చేపలను ఒడ్డుకు చేరిన వెంటనే అదే వడ్డీ వ్యాపారులకు వాళ్లు నిర్ణయించిన ధరలకే అమ్ముకునే పరిస్థితి తప్పడం లేదు. ఈ పరిస్థితే వీళ్లలో చాలా మందిని వృత్తిని వదిలేసి మరపడవల్లో రోజువారి కూలిగా వెళ్ళే పరిస్థితికి కారణం అవుతుంది. ఇలా వృత్తిని వదిలిపెట్టిన వారందరికి పని దొరుకుతుందనుకుంటే పూర్తిగా పొరపాటు. ఇందులో ఎంతో మందికి మరపడవల్లో రోజువారి కార్మికులుగా కూడా పనిదొరకడం లేదు. ఇపుడు మరపడవలకు తోడు మరింత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన ట్రాలర్లు, స్వదేశీ, విదేశీ కంపెనీలకు చెందిన భారీ ఫిషింగ్ షిప్‌లు నిరాటంకంగా వారాలు, నెలలు తరబడి సముద్రంలో (ఫిషింగ్ షిప్ మూడు నెలల పాటు చేపల వేటను కొనసాగిస్తుంది) తిష్టవేసి కొనసాగిస్తున్న చేపల వేట ద్వారా అపార, అపూర్వ నానారకాల మత్స్యసంపదను ఎడతెరిపి లేకుండా తోడెయ్యడంతో నాసిరకం బోట్లు, తెప్పలు, వలలతో వేటకు వెళ్ళే పేద సంప్రదాయ మత్స్యకారులకు మిగిలేది నిరాశ, నిస్పృహ, కష్టాలు, కన్నీరు కడగండ్లు మాత్రమే. మత్స్యకారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న మరొక విషయమేమంటే తీరప్రాంతాల్లో నాగరికత, టూరిజం అభివృద్ధి, కాటేజీలు, కాలేజీలు, పార్కులు, విహారస్థలాల పేరుతో అనేక నిర్మాణాలు వెలుస్తున్నాయి. మరొక పక్క, పరిశ్రమలు రొయ్యల హేచరీస్, లాంటి పర్యావరణ హానికర సంస్థలూ వెలుస్తున్నాయి. తీరానికి 500 మీటర్లలోపు (బయటి ప్రాంతం) ఎలాంటి పరిశ్రమలు, నిర్మాణాలు ఏర్పాటు చేయకూడదన్న చట్టాన్ని ప్రైవేటు సంస్థలు ఉల్లంఘించడం మాత్రమే కాదు. సాక్షాత్తు ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుంటే అంతకంటె అన్యాయం ప్రత్యక్షంగా కనిపిస్తున్న ఈ మొత్తం పరిణామం అంతా పరోక్షంగా మత్స్య రంగంలో పెత్తనం సంపాదించిన బడా పెట్టుబడిదార్ల లాభాలను దినమొక గండంగా బ్రతుకు లీడుస్తున్న పేద మత్స్యకారులకు నష్టాలను కలుగచేస్తుంది. నాగరికతా, టూరిజం, అభివృద్ధి పేరుతో వెలిసిన, వెలుస్తున్న సంస్థలు, పరిశ్రమలు విడుదల చేస్తున్న జల, వాయు, శబ్ద, వాతావరణ కలుషితాల కారణంగా నాటు పడవల వేటకోసం రిజర్వు చేసిన (తీరప్రాంతం నుండి 22 కిలో మీటర్ల వరకు గల) సముద్రప్రాంతం నుండి అపార మత్స్య సంపదంతా మరింత దూరప్రాంతం నుండి పరిమిత ప్రాంతంలోనే చేపల వేటను కొనసాగించగల నాటు పడవల సంప్రదాయ మత్స్యకారుల వేటకు పూర్తి అననుకూలం కాగా, తీరప్రాంతం నుండి సముద్రంలో, మరింత దూర ప్రాంతంలో సైతం అతి సులువుగా వేటాడగల అధునాతన మరపడవలు, ట్రాలీలు, ఫిష్ షిప్పింగ్‌ల యజమానులకు ఎంతో ప్రయోజనకరంగా మారింది.

ఇదిలా ఉండగా కాలువల్లో, చెరువుల్లో చేపలవల్లే మత్స్యకారులకు మార్కెట్లపై అవగాహనా లేమి, నిరక్షరాస్యత, దారిద్ర్యం, పెట్టుబడుల కొరతను ఆసరా చేసుకొని బినామీ పేర్లతో కొందరు సంపన్న పెట్టుబడిదారులు మత్స్యసహకార సంఘాల్లో ప్రవేశించడం ద్వారా వచ్చే అపారమైన లాభాలను సొంతం చేసుకుంటున్నారు. గతంలో ఆయా ప్రాంతాల్లోని సంప్రదాయ మత్స్యకారులు రోజువారి వేట ద్వారా ఏడాది పొడవునా జీవనోపాదిని పొందుతూ, స్థానిక, ప్రాంతీయ ప్రజానీకానికి అత్యంత చౌకగా రకరకాల పౌష్టికరమైన చేపలను అందించిన పరిస్థితి అంతా తారుమారైంది. మత్స్యవృత్తితో ఏమాత్రం సంబంధం లేకుండా భారీపెట్టుబడులు పెట్టగల స్తోమతగల సంపన్నవర్గాలు మత్స్యసహకార సంఘాల్లో చేరి, తద్వారా వచ్చే లాభాలన్నింటిని మూటగట్టుకుంటూ, స్థానిక సంప్రదాయ మత్స్యకారులను 'కిలో కమీషన్ దారులుగా' మార్చేస్తున్నారు. ఏడాది పొడవునా కొనసాగే చేపలవేట సహకార సంఘాల్లోకి వీరు రావడంతో అధునాతనమైన అతి పెద్ద వలలతో నిర్వహింపబడుతున్న వేటద్వారా ఆయా జలాశయాలనుండి చేపలను మూడు నెలలలోపుగానే తోడేయడం (చేపలవేట ప్రారంభమైన తర్వాత నెలరోజులకన్నా ఎక్కువ

ఉండదు)తో ప్రభుత్వం దాన్ని మూడు నెలల పంటగా ముద్ర వేయడం ఒకకుట్ర.

మొత్తానికి చేపల వేటపై సహజ హక్కులు కలిగిన సంప్రదాయ మత్స్యకారుల చేతుల్లో నుండి మత్స్య పరిశ్రమను లాగేసి దేశ, విదేశీ, బహుళజాతి, పెట్టుబడిదారుల పరం చేయడానికి గాను చేయగలిగిందంతా చేస్తూ, మరొకవైపు వృత్తిని కోల్పోయి, నిస్తేజంగా, నిరాశ నిస్పృహలతో చేష్టబడిగిన మత్స్యకారుల ఓటు బ్యాంకును కొల్లగొట్టే లక్ష్యంతో ప్రతీ ఏటా అనేక రకాలైన అవసరం లేని, పనికిరాని (అవసరం ఉన్నా, అవకాశం లేదు) పథకాలెన్నో ప్రభుత్వం ప్రవేశపెడుతుంది. ప్రతీ ఏడు బడ్జెట్‌లో ఈ పథకాల అమలుకోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెప్పుకుంటున్నా ఆ ధనం అంతా చేరేది, దళారి, అవినీతి పరశక్తుల, కాంట్రాక్టర్ల జేబుల్లోకే గాని మత్స్యకారులకు చెందింది మాత్రం సముద్రంలో నీటి బొట్టంత అని అనడం అతిశయోక్తి కాదు. కార్యాచరణను గాలికొదిలేసి ఆచరణ అవసరమే లేకుండా కేవలం కీర్తి ప్రతిష్టలకోసం పాప్యులిస్టు పథకాల ప్రచార ఆర్భాటానికి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని మంచినీళ్ల ప్రాయంలా ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, వృత్తి నిర్వహణలో మరణిస్తున్న మత్స్యకారులకు 50 వేల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడానికి అష్టకష్టాలు పడుతుందంటే మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వానికి గల శ్రద్ధ ఎపాటిదో అర్థమవుతుంది.

ఉదాహరణకు సముద్ర తీర ప్రాంతాల్లో చేపల వేటలో ఉన్న మత్స్యకారులు అణుక్షణం వాతావరణంలో మార్పులు, సముద్రంపై దాని ప్రభావం - తుఫాన్, ఈదురు గాలుల సమాచారాన్ని సముద్ర తీర కమ్యూనికేషన్ స్టేషన్ల నుండి పొందగల వి.హెచ్.ఎఫ్. యంత్రాలను సబ్సిడీపై అందజేసే పథకం ఎన్నాళ్ళుగానో అమలులో ఉన్నా ఈ రోజువరకు ఆ యంత్రాలను కలిగి ఉన్న సంప్రదాయ మత్స్యకారులు బహు తక్కువ మంది ఉన్నారనడం కంటే లేనేలేరని అనడమే కరెక్ట్‌గా ఉంటుంది. తుఫాన్, ఈదురు గాలుల తదితర సమాచారాన్ని ముందస్తుగా తెలుసుకునే అవకాశం లేకపోవడంతో వేటకు వెళ్లిన ఎందరో మత్స్యకారులు గల్లంతయ్యారు.

దేశ ప్రజల్లో చేపల పౌష్టికాహారంపై అవగాహనను కలిగించి దేశీయ మార్కెట్‌ను అభివృద్ధి పరచడం, సంప్రదాయ మత్స్యకారులకు చేపల వేటలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగించడం, నాణ్యమైన పరికరాలను, నాణ్యమైన విత్తనాల్ని పూర్తి సబ్సిడీ మీద అందించడం, సముద్ర తీర ప్రాంతాల్లోని సంప్రదాయ మత్స్యకారులకు రిజర్వు చేసిన ప్రాంతాల్లో విదేశీ ట్రాలర్లు, మరపడవలు, ఫిషింగ్ షిప్‌ల ద్వారా జరుగుతున్న చేపల వేటను నిషేధించి మత్స్యకారుల కుటుంబాల సంక్షేమానికి పూర్తిస్థాయిలో కట్టుబడిన ప్రభుత్వ విధానాల అమలు ద్వారా మాత్రమే సముద్రం నుండి ఒడ్డుకు విసరబడిన మత్స్యకారులను తిరిగి వేటకు పంపే అవకాశం ఏర్పడుతుంది. కాని, ప్రపంచీకరణకు అడ్డులేని ఆర్థిక విధానాల రూపకల్పనల ద్వారా అవకాశం కల్పించి అంతర్జాతీయ బహుళ జాతి కంపెనీలకు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలన్నింటిని గ్యారంటీగా అప్పజెప్పుతామని ప్రపంచబ్యాంకు వద్ద పూచి పడ్డ పాలక వర్గాలు, అందుకు వ్యతిరేక దిశలో ప్రవర్తిస్తాయని ఆశించడం అన్ని విషయాల్లో లాగే ఈ విషయం లోనూ అత్యాషే అవుతుంది.❑

వినదగు నెవ్వరు చెప్పిన

"సహాయం పేరుతో ధనిక దేశాలనుంచి వచ్చే ప్రతి డాలర్‌కు పేద దేశాలు తిరిగి ఆదేశాలకు రెండు డాలర్లు చెల్లిస్తున్నాయి. ధనిక దేశాలకు అనుకూలంగా ఉన్న వ్యాపార లావాదేవీలు, షరతులే దీనికి కారణం. అభివృద్ధి చెందిన దేశాలు వారి వారి దేశాల్లో వ్యవసాయానికి పెద్ద మొత్తంలో సబ్సిడీలు ఇస్తూ, వారి దేశాల్లోకి దిగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులమీద రకరకాల ఆంక్షలు విధిస్తున్నాయని అంతర్జాతీయ సంస్థ ఆక్స్‌ఫామ్ అంటోంది.

"ధనిక దేశాలు వర్ధమాన దేశాలను సబ్సిడీలు తగ్గించాలని సుద్దులు చెబుతూ, రెండోపక్క తమ దేశాల్లో రోజుకు ఒక మిలియన్ డాలర్లు సబ్సిడీలు చెల్లిస్తున్నాయి. అలా సబ్సిడీ ఇచ్చిన వ్యవసాయ ఉత్పత్తులను వర్ధమాన దేశాల్లో కుమ్మరిస్తున్నాయి. దానితో వర్ధమాన దేశాల మార్కెట్లలో వారి ఉత్పత్తుల ధరలు పడిపోతున్నాయి. ఇది ఆదేశాల ఆర్థిక పరిస్థితిపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది. ధనిక దేశాల్లో ఉత్పత్తిదారులు చెల్లించే టారిఫ్ రేట్లకన్నా పేద దేశాల ఉత్పత్తిదారులు నాలుగు రెట్లు ఎక్కువ టారిఫ్ రెట్లు చెల్లిస్తున్నారు. ఇలాంటి అన్యాయమైన విధానాలను మార్చుకోవాలని డబ్ల్యు.టి.వో, ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్, బహుళ జాతి సంస్థలను ఆక్స్‌ఫామ్ కోరింది. డబ్ల్యు.టి.వో నిబంధనల పుణ్యమా అంటూ, 1997 నుంచి కాఫీ ధరలు 70 శాతం తగ్గిపోయి, కాఫీ ప్రధానంగా ఉత్పత్తి చేసే దేశాలు ఎనిమిది బిలియన్ డాలర్లు నష్టపోయాయి. ఉత్పత్తి చేసేది పేద దేశాలయితే, దాని ధర నిర్ణయించేది ధనిక దేశాలు.

.............ప్రపంచంలో ఒక బిలియన్ ప్రజలు పేదరికంలో నివసిస్తున్నారు. ఆఫ్రికా, తూర్పు ఆసియా, దక్షిణాసియా, లాటిన్ అమెరికా ప్రపంచ ఎగుమతుల్లో వారి శాతాన్ని కేవలం ఒక్క శాతం పెంచుకోగలిగితే 128 మిలియన్ ప్రజలను పేదరికం నుంచి విముక్తి చేయవచ్చు. కేవలం ఒక్క ఆఫ్రికానే తీసుకొంటే ఈ ఒక్కశాతం పెరుగుదల 70 బిలియన్ డాలర్ల సంపాదనకు తోడ్పడుతోంది. తక్కువ ఆదాయం గల పేద దేశాల్లో, ప్రపంచ జనాభాలో 40 శాతం మంది నివసిస్తున్నారు కాని ప్రపంచ వ్యాపారంలో వారి వాటా మూడోశాతం మాత్రమే."

- యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా, 'న్యూస్ టైమ్'

మన ఆర్థిక వ్యవస్థపై అమెరికా దురాక్రమణ ప్రభావం

"రేపు ఏం జరుగుతుందో ఎవరికెరుక?" "రేపు మన చేతిలో లేదు" "రేపటి సంగతి అలా వుంచు. ఇవాళ ఇంటినుంచి బయటకు వెళితే, ట్రాఫిక్ చూస్తే మళ్లా తిరిగివస్తామా?" - ఇలా వుంటున్నాయి ప్రజల మనోభావాలు, స్పందనలు. ప్రభుత్వాలూ అంతే. ఆర్థిక పరిస్థితీ అలాగే వుంది. ప్రతినెలా, ప్రతిమూడో నెలా ఓసారి లెక్కలు వేసుకొని మనం పురోగమిస్తున్నామా, తిరోగమిస్తున్నామా అని వెనక్కు తిరిగి చూసుకోవాల్సిన పరిస్థితులేర్పడ్డాయి.

2002-03 ఆర్థిక సంవత్సరమే తీసుకొంటే మొదటి మూడునెలలూ ఆశాజనకంగానే వుండి ఆర్థిక మాంద్యంనుండి బయట పడుతున్నామేమోనని అనిపించింది. జరుగుతున్న పరిణామాలను అనేక దృక్కోణాలనుంచి పరిశీలించి, ఫర్వాలేదని పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వమూ, ఆర్థిక శాస్త్రజ్ఞులు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

తర్వాత మూడు నెలల కాలంలో వర్షాలు పడకపోయే సరికి, అనుమానానికి బీజాలు పడ్డాయి. అయినా ఎగుమతుల లెక్కలో, బ్యాంకు రుణాలో, మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో ఉత్పత్తుల పెరుగుదలనోచూచి, చూపించి, ఫర్వాలేదన్నారు. వర్షాభావ పరిస్థితులు, కరువు పరిస్థితిగా మారటం ప్రారంభించేసరికి, ఒళ్ళు చల్లబడటం ప్రారంభించినా పళ్ళ బిగువుతో కాలం గడిపారు. ఆశా నిరాశల మధ్య ఆర్థిక పరిస్థితి ఊగిసలాడింది. ఆ తర్వాత మూడు నెలల కాలం ఫలితాలు ఇపుడిపుడే వెల్లడయ్యాయి. స్థూల జాతీయాదాయం పెరుగుదల 5.6 శాతం పెరుగుతుందని అనుకోగా 4.4 శాతం మించదని అనుకొంటే అది 2.6 శాతానికి పడిపోయిందని కేంద్ర ప్రభుత్వ సంస్థ సిఎస్వో ప్రాథమిక అంచనాలను ప్రకటించింది. ఆ ప్రకటను కూడా ఇరాక్‌పై యుద్ధం సాగుతున్న సమయంలో రావటంతో కాళ్ళు చచ్చుపడిపోయాయి. అసలే అమెరికా ఆర్థిక సంక్షోభంలో వుండగా, ఇరాక్ యుద్ధాన్ని తలకెక్కించుకోవటంతో దాని ప్రభావంలో ఈ సంవత్సరం అంతా ప్రపంచం మొత్తం మాంద్య పరిస్థితిలో పడుతుంది. ప్రపంచీకరణ ఊబిలో దిగుబడివున్నాం కాబట్టి ప్రపంచ ఆర్థిక పరిస్థితి కొచ్చిన రోగం మనమెడకు కూడా చుట్టుకొంటుంది. పూర్వం సోవియట్ యూనియన్‌లో వర్షం పడితే, ఇండియాలో కమ్యూనిస్టులు గొడుగులు విప్పుతారనేవారు. ఇపుడు అమెరికాలో బుష్ తుమ్మితే, ఇక్కడ మొత్తం దేశానికే జలుబు పట్టుకొంటుంది.

ప్రస్తుతం మనం ఇరాక్ నుంచి చమురు దిగుమతి చేసుకొంటున్నాం. యుద్ధం ఇరాక్‌లో ఆగిపోతుంది కాని, అమెరికాకు ఇది యుద్ధం కొనసాగింపు మాత్రమే. తర్వాత ఇరాన్, సౌదీ అరేబియాల్లో తన అడుగులకు మడుగులొత్తే ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకొని, ప్రపంచానికి చమురును సరఫరా చేసే మూడు దేశాల మీద అమెరికా చమురు కంపెనీలు గుత్తాధిపత్యాన్ని సాధించుకొని, ఈ చమురు నిల్వల మీద ఆధారపడ్డ ప్రతిదేశం మీద రాజకీయార్థిక పట్టు సంపాదించినా ఆశ్చర్యం లేదు. ప్రస్తుత అమెరికా దురహంకార, దూకుడు ఆక్రమణల పోకడను గమనిస్తే ఈ విషయం చాలా స్పష్టంగా కనబడుతుంది. ఈ జైత్రయాత్రలో అడ్డువచ్చిన ఏ దేశాన్నయినా యుద్ధం అనే కత్తితో నరికి పోగులు పెడుతుంది. అంటే ప్రపంచ మంతా యుద్ధ వాతావరణం అలుముకొంటుంది. దాని ప్రభావం నుంచి మన ఆర్థిక వ్యవస్థ తప్పించుకోలేదు. చమురు నిల్వల మీద గుత్తాధిపత్యం సంపాదించిన తర్వాత చమురు ధరలను ఇవాళ కాకపోతే రేపయినా పెంచితీరుతుంది. 86 వేల కోట్ల రూపాయల విలువగల చమురు నిల్వ దిగుమతుల మీద ఆధారపడ్డ మన దేశం ధరల పెరుగుదలను తప్పకుండా రుచి చూడబోతుంది. చమురు ధర పెరిగితే వ్యవసాయం, రవాణా, పరిశ్రమలు అన్నీ ప్రభావితమవుతాయి.

గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయులు పంపే డబ్బు మన విదేశీ మారక నిల్వల పెరుగుదలకు ఒక పెద్ద దిక్కు. వీరిలో బతికుంటే బలుసాకు తినవచ్చుననుకొనేవారు తిరిగి దేశానికి వచ్చేస్తే వారు పంపే డాలర్లు నిలిచిపోతాయి. చమురు నిల్వలపై గుత్తాధిపత్యం సంపాదించే అమెరికా కంపెనీలు భారతీయులందరినీ వెనక్కు పంపించేటంత తెలివితక్కువ పని చేయవు. కాని గల్ఫ్ ప్రాంత మంతా అనిశ్చిత పరిస్థితి, యుద్ధ వాతావరణం, యుద్ధ భయం, ఇక్కడున్న వారి కుటుంబ సభ్యుల, బంధువుల ఒత్తిడి లాంటివి ఎన్నో వారిమీద పనిచేయవచ్చు. ఒకవేళ తిరిగి వచ్చేస్తే, వారికిక్కడ ఉద్యోగాలు కాసుకొని కూర్చోలేవు.

ప్రపంచ వ్యాప్తితంగా యుద్ధ వాతావరణం ఏర్పడిన తర్వాత, వివిధ దేశాలు ఆర్థిక అనిశ్చితితను ఎదుర్కొంటున్న నేపథ్యంలో మన ఎగుమతులకు మార్కెట్ లభ్యమవుతుందా అనేది మరో ముఖ్య సమస్య. మన దేశం ఇరాక్‌కు, గల్ఫ్ దేశాలకు ఆహార ధాన్యాలను ఎగుమతి చేస్తుంది. ఇప్పటికిప్పుడు ఆ ఇరాక్ నుంచి ఆరు లక్షల టన్నుల తిండిగింజలకు ఆర్డర్లున్నాయి. మన దేశంలో వ్యాపారస్తులు తమ ఎగుమతులు పెరుగుతాయని లొట్టలు వేయవచ్చు. కాని ఇంతవరకు ఇరాక్‌ను బ్లాక్‌డే చేస్తూ వచ్చిన

('మిగతా 24వ పేజీలో)

అదుపూ, హద్దూ లేని రాష్ట్ర ఆదాయ వ్యయాలు

- వి. హనుమంతరావు

అంచనా వేసిన ఆదాయం రాదు, అనుకొన్న ఖర్చు హద్దు మీరుతుంది. కేటాయింపులు చేస్తారు కాని ఖర్చు కాదు. బడ్జెట్‌లో కేటాయించిన సొమ్ము చాలదు. ఇంకా కావాలి అని శాసన సభ ఆమోదం తీసుకొని ఖర్చు చేయరు. బడ్జెట్‌లో కేటాయింపు లేకుండానే ఖర్చు చేసేస్తారు. అనుకొన్న దానికన్నా ఎక్కువ ఖర్చు చేసినపుడు, అలా ఎక్కువ ఖర్చుచేసిన మొత్తానికి శాసనసభ ఆమోదం తీసుకోవాలి కాని సంవత్సరాలు గడిచినా తీసుకోరు. సంవత్సరం ఆఖరున కేటాయించిన మొత్తం ఖర్చుకానపుడు ఆయా శాఖలు మిగులును ప్రభుత్వానికి దాఖలు పరచాలి కాని ఆ పని చెయ్యరు. ఇంకా విచిత్రమేమంటే కేటాయింపు అంతా ఖర్చుచేసినా మిగిలిందని అంటారు. వేసిన పన్నులను పూర్తిగా వసూలు చెయ్యరు. రావాల్సిన బకాయిలు రాబట్టుకోరు. ఆహా, రామకృష్ణుని బడ్జెట్ లీలలు ఎన్నతరమూ? ఆనాడు మన్ను తింటున్నాడని బాలకృష్ణుణ్ణి నోరుతెరచి చూపమంటే యావత్ ప్రపంచాన్నే చూపించాడని ఈనాడు రామకృష్ణుని బడ్జెట్ కథ కట్టలు విప్పి చూపించమంటే ఆయన ఏం చూపించారో స్వయంగా ఎక్కౌంటెంట్ జనరల్ (కాగ్) ఉవాచా వినండి. అలా వినిపించే ముందు ఒకమాట.

ప్రభుత్వ యంత్రాంగానికి ఇప్పటికే కాగ్ అంటే కించిత్ గౌరవం, గుర్తింపు లేదు. ప్రతి కాగ్ నివేదికలో ఫలానా లోపాన్ని, పొరపాటును ప్రభుత్వ దృష్టికి తీసుకొనివచ్చానని, అయితే నెలలు, సంవత్సరాల తరబడి అధికారులు జవాబు ఇవ్వలేదని, చర్య తీసుకొన్నదీ, లేనిదీ తెలియటం లేదని, పొరపాటును సరిదిద్దినట్లు చెప్పరని, ఇలా నివేదిక తర్వాత నివేదికలో ఎత్తి చూపిస్తూ వచ్చినా ఇసుమంత స్పందన లేదని నివేదికలు చెబుతున్నాయి. రాజకీయ నాయకులకు లాగే, బురాక్రసీకి కూడా చర్మం దళసరి బారింది. ఆ నేపథ్యంలో బాధ్యతగల ముఖ్యమంత్రి రాజ్యాంగం సృష్టించిన, నేరుగా దేశాధ్యక్షునిచే నియమించబడిన ఎక్కౌంటెంట్-జనరల్‌నే విమర్శించటం ప్రారంభిస్తే అది బురాక్రసీకి లైన్ క్లియర్ ఇచ్చినట్లయింది. మాటవరసకు కాగ్ వ్యక్తం చేసిన అభిప్రాయం పొరపాటేనని అనుకుందాం. బాధ్యతగల ముఖ్యమంత్రి అయితే, కాగ్‌కు ఒక ఉత్తరం వ్రాయవచ్చును. ఆయన అభిప్రాయం ఎలా పొరపాటు అభిప్రాయమో ఎత్తి చూపవచ్చు. కాని ఇలా బురాక్రసీకి గేట్లు తెర్వటం అభ్యంతరకరమైన విషయం. ఇక వివరాల్లోకి వెళ్దాం.

2001-2002 సంవత్సరాల్లో ప్రభుత్వం ఖర్చు మొత్తంలో ప్రతి ఐదు రూపాయల్లో రెండు రూపాయలు సంవత్సరం చివరి మూడు నెలల్లోనే ఖర్చు అయ్యింది. ఒక్క మార్చి నెలలోనే ప్రతి అయిదు రూపాయల్లో ఒక రూపాయ ఖర్చు చేసింది. ఆఖరు నిముషంలో హడావుడిఖర్చు అంటే ఎన్నిలోసుగులుంటాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇదేదో ఈ సంవత్సరంలోనే కాదు, అంతకు ముందు సంవత్సరంలోకూడా మార్చినెలలో 34 శాతం, చివరి మూడు రోజుల్లో 47 శాతం ఖర్చు జరిగింది.

శాసనసభ వోటు చేయకుండానే, బడ్జెట్‌లో కేటాయింపు చేయకుండానే ప్రభుత్వం రు. 525 కోట్లు వివిధ పద్దుల కింద ఖర్చు చేసింది. ఇందులో రు. 200 కోట్లు ఒక్క పంచాయతీరాజ్ శాఖలోనే ఖర్చు అయ్యింది. ఆ తర్వాత రామకృష్ణుడి గారి ద్రవ్య శాఖే రూ. 60 కోట్లు ఆమోదం లేకుండానే ఖర్చు చేసింది. కంచె చేను మేసిన కథ గుర్తుకు వస్తోంది. అంతకుముందు సంవత్సరంలో ఈ ఖర్చు రు. 367 కోట్లు. "ముందుకు పోతున్నా" మన్నమాట.

ఆదా చేసిన మొత్తం కన్నా ఎక్కువగానే ప్రభుత్వ ఖాతాలో జమ వేయటం ప్రతి సంవత్సరం జరుగుతున్న విచిత్రం. ఉదాహరణకు గవర్నరు, మంత్రులపద్దుకు రు. 7.49 కోట్లు కేటాయిస్తే రు. 0.33 కోట్లు ఖర్చు చేయలేదు. ఇది తిరిగి ప్రభుత్వానికి జమ వెయ్యాలి. కాని వేసింది రు. 1.41 కోటి. ఇలా ఆ సంవత్సరంలో అన్ని పద్దులలోకూడా జమచేసింది 570 కోట్లు.

ప్రభుత్వం ఏ స్థానిక సంస్థకుగాని, మరే ఇతర సంస్థకు గాని, ఆస్తుల సృష్టికి గాని గ్రాంటు ఇస్తే అది పెట్టుబడి పద్దుగా భావించకూడదని రాజ్యాంగం చెబుతుంది. కాని ప్రభుత్వం రు. 1190 కోట్లు పెట్టుబడి పద్దు కింద చూపించింది. ప్రభుత్వానికి ఈ విషయాన్ని చెబితే, అది రుణం ఇచ్చినట్లు వ్రాస్తాం అని చెప్పింది. కాగ్ అందుకు అభ్యంతరం చెప్పింది.

ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. నియమ నిబంధనలకు విరద్ధంగా వందలకోట్ల రూపాయలు ఖర్చు అయ్యింది ఆర్థిక శాఖామాత్యులు ఇలా ప్రతి సంవత్సరం జరుగుతూ వస్తున్న అక్రమ విధానాలకు ఎపుడు ఫుల్‌స్టాప్ పెడతారో తెలియదు. కాగ్ నివేదిక సూచనలను పబ్లిక్ ఎక్కౌంట్స్ కమిటీ పరిశీలించి 1962-63 నుంచి 2001 వరకు 1159 రికమండేషన్లు చేసింది. ఇవన్నీ ఇంకా పెండింగ్‌తో వున్నాయని కాగ్ నివేదిక చెబుతుంది. అంటే నాలుగు దశాబ్దాలు దాటినా ఇంకా కొన్ని పెండింగ్‌లో వున్నాయన్నమాట. గుడ్ గవర్నెన్స్ బ్రహ్మాండంగా వుంది. ❑

అయోధ్య తవ్వకాల తీర్పు - న్యాయవ్యవస్థ పయనం ఎటు?

- ఎన్. వేణుగోపాల్

అయోధ్యలోని బాబ్రీ మసీదు - రామజన్మభూమి వివాదాస్పద స్థలంలో కొత్తగా తవ్వకాలు జరపాలని ఆదేశించి అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ ఒక కొత్త వివాదానికి దారి తీసింది. జస్టిస్ భన్వర్‌సింగ్, జస్టిస్ ఎస్.ఆర్. ఆలమ్, జస్టిస్ సుధీర్ నారాయణీలు ఇచ్చిన తీర్పు, ఆ తరువాత జరుగుతున్న పరిణామాలు ఆసాధారణంగా, అధికారంలో ఉన్న హిందూ మతోన్మాద ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నాయి. ఒకవైపు సుప్రీంకోర్టులో ఇదే వివాదం విచారణలో ఉండగా, కోర్టు తీర్పు ఎలా వచ్చినా తాము ఆలయ నిర్మాణంతో ముందుకే పోతామని విశ్వహిందూ పరిషత్ హుంకరిస్తూ ఉండగా అటు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వమూ, ఇటు కేంద్ర ప్రభుత్వమూ హిందూ మతోన్మాదులను బుజ్జగించే కార్యక్రమంలో ఉండగా లక్నో బెంచి తీర్పు అనవసరమయినదే కాక ప్రమాదకరమయినది కూడా.

మార్చి 5న వెలువడిన ఈ తీర్పు మూడు కారణాల వల్ల అభ్యంతరకరమయినది. మొదటిది ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం మార్చి 6న ఈ వివాదం తుది తీర్పు కొరకు వాదనలు వినబోతుండగా ఒక్కరోజు ముందు హడావుడిగా తీర్పు ఇవ్వటం, ఆ తీర్పును వెంటనే అమలు చేయడానికి తవ్వకాలు ప్రారంభం కావడం పాలకుల దురుద్దేశ్యాన్ని సూచిస్తుంది. రెండు - ఏ న్యాయస్థానమయినా ఒకపని జరగాలని ఆదేశించవచ్చును. కాని ఆ పని ఎవరిచేత జరిపించాలో ఆదేశించడం అప్రస్తుతం. లక్నో బెంచి వివాదాస్పద స్థలంలో కొత్తగా తవ్వకాలు జరపమని భారత పురాతత్వ సర్వేను ఆదేశిస్తూ ఆ పనిలో న్యూఢిల్లీకి చెందిన కెనెడియన్ సంస్థ 'టోజో ఇండియా వికాస్' సహాయం తీసుకోమని కూడా ఆదేశించింది. ఈ దేశంలో పురాతత్వ పరిశోధనలు కనీసం పరిసరాల పురావస్తువుల మీద, శిథిలాల మీద పరిశోధనలు జరిపిన చరిత్రకారులు, పురాతత్వశాస్త్రజ్ఞులు, నిపుణులు డజన్లకొద్దీ ఉన్నారు. నివేదికలు ఉన్నాయి. బాబ్రి మసీదు విధ్వంసం తరువాత 'జాతికి చరిత్రకారుల నివేదిక' పేరుతో చరిత్రకారులు ఆర్.ఎస్.శర్మ, ఎమ్. అక్తర్ అలీ, డి.ఎన్. ఝా, సూరజ్ ఖాన్ ప్రకటించిన నివేదిక ఉంది. అయోధ్యకు సంబంధించి విస్తృతమయిన పరిశోధనలు జరిపి ప్రామాణికమయిన 'ది రామాయణ ఇన్ హిస్టారికల్ పర్‌స్పెక్టివ్ రచించిన చరిత్రకారుడు. పురాతత్వ శాస్త్రవేత్త హెచ్.డి. సంకాలియా ఉన్నారు. ఈ దేశీయ పరిజ్ఞానాన్నంతా కాదని ఒక కెనెడియన్ సంస్థ పేరును న్యాయస్థాపనకు స్వయంగా ఆదేశించడం ఆ సంస్థకు విశ్వహిందూ పరిషత్‌తో ఉన్న సంబంధం వల్లనే అని అనుమానించడానికి ఆస్కారం ఉంది.

మూడు - అసలు లక్నో బెంచి ముందరకు వచ్చిన వివాదమేమిటి? ఆ వివాదాన్ని పరిష్కరించడానికి తవ్వకాలు ఎట్లా ఉపయోగపడతాయి? లక్నో బెంచ్ వివాదాస్పద స్థలంపైన చట్టబద్ధ అధికారమెవ్వరిది - అని నిర్ణయించవలసి ఉంటుంది. భూమి మీద చట్టబద్ధ అధికారం అన్నప్పుడు న్యాయస్థానాల పరిభాషలో అది కేవలం ఎవరి పట్టాలో ఉన్నది అనే సాంకేతిక అంశంగా మారిపోతుంది. వివాదాస్పద స్థలం అని ప్రస్తుతం పిలవబడుతున్న రెండెకరాల డెబ్బై ఏడు సెంట్ల స్థలం ఏ రకమయిన చట్టపరమయిన ప్రమాణాలతో చూసినా బాబ్రీ మసీదుకు చెందుతుంది. అది వివాదాస్పద స్థలం కాదు. 1949 డిసెంబర్ 22 రాత్రి ఆ మసీదు పోలీస్ స్టేషన్‌లో మాతాప్రసాద్ అనే కానిస్టేబుల్ నమోదు చేసిన ప్రాథమిక సమాచార నివేదికలో అర్ధరాత్రి వేళ బాబ్రీ మసీదు నిర్జనంగా ఉన్నప్పుడు ఒక గుంపు గోడ దూకి లోపలికి వెళ్ళి విగ్రహాలు పెట్టి అలంకారాలు చేసిందని రాసారు. అప్పటి నుంచీ 1992 డిసెంబర్ 6 దాకా ఫైజాబాద్ అధికార యంత్రాంగం, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం చేసిన అనేక కుట్రల, రాజకీయ ఎత్తుగడల ఫలితంగా బాబ్రీ మసీదు విధ్వంసం జరిగింది. ఆ స్థలం "వివాదాస్పద స్థల"మయ్యింది.

ఇప్పుడు పాత దస్తావేజులను మార్చి చట్టపరమైన పట్టా అధికారాన్ని మరొకరిపేరు మీదికి మార్చడానికి వీలు లేదు. కనుక లక్నో బెంచ్ కొత్త ఎత్తుగడ వేసింది. తన ముందర చర్చకే రాని సమస్యను, తన పరిధిలో లేని విచారణాంశాన్ని తలకెత్తుకుని వివాదాస్పదమయిన తీర్పును ప్రకటించింది. తవ్వకాలు జరిపి అక్కడ ఒకప్పుడు ఏదైనా ఆలయం ఉండేదో లేదో తేల్చి చెప్పమని పురాతత్వ సర్వేను ఆదేశించింది.

ఈ తీర్పు అసంబద్ధతను గుర్తించడానికి, ప్రశ్నించడానికి మూడు ప్రాతిపదికలున్నాయి.

ఒకటి, ఇప్పటికే విశ్వహిందూ పరిషత్, ఇతర మతోన్మాద శక్తులు తప్పుడు చారిత్రక ఆధారాలు చూపడానికి, ఉన్న ఆధారాలకే తమవైన వ్యాఖ్యానాలు చేయడానికి ప్రయత్నిస్తున్న సందర్భంలో ఈ తవ్వకాలలో దొరకగల వస్తువులు, కొత్త వివాదాలకు, కొత్త వ్యాఖ్యానాలకు, కొత్త గందరగోళానికి దారి తీసే అవకాశం ఉంది. ఇదేమీ ఊహకాదు. వాస్తవంగానే తవ్వకాలు ప్రారంభమైన తొలి రోజుల్లో ఒక గవ్వ, ఒక రంగురాయి బయటపడ్డాయి. ఎన్నో వందల ఏళ్ళుగా జనావాసాలున్న ప్రాంతంలో, ఒక నదీ తీరంలో ఒక గవ్వ, ఒక రంగురాయి బయటపడటం ఆశ్చర్యకరమేమీ కాదు. కానీ

వెంటనే తవ్వకం కార్యక్రమ నిర్వాహకులు ఇచ్చిన ప్రకటన చూస్తే తవ్వకాలు ఏ దిశగా సాగుతున్నాయో తేటతెల్లమవుతుంది. ఆ ప్రకటనలో వారు "ఒక శంఖం. ఒక గోమేధికం దొరికాయ"ని ప్రకటించారు. ఒక గవ్వను, ఒక రంగు రాయిని అట్లా అభివర్ణించడం తప్పు కాకపోవచ్చు కానీ శంఖం, గోమేధికం అనే మాటలకు ఉన్న మతాచార అర్థంలో అవి కొత్త ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. ఇంకొక్క అడుగు వేస్తే అది రాముడు ఊదిన శంఖమని, అది సీతమ్మవారి ఉంగరంలోని గోమేధికమని చెప్పడం కష్టం కాదు.

రెండు, ఈ దేశంలోని ఏ చారిత్రక కట్టడం అయినా అంతకు ముందరి తరాల నిర్మాణాల పునాది మీద సాగిందే. ఇప్పుడు పునాదులు తవ్వి ప్రస్తుత నిర్మాణాల మూలాలు వెతికే కార్యక్రమం అపారమయిన శక్తి, సమయము వృథాచేసి అనవసరమయిన వివాదాలను సృష్టిస్తుందే తప్ప కొత్తగా సాధించగల ఉపయోగకర ఫలితమేమీ లేదు. ఇట్లా తవ్వుతూ, మూలాలు వెతుకుతూ, ఎంతో వారసత్వ సంపదను కూల్చి తవ్వకాలు జరపవలసి ఉంటుంది. మొత్తంగా దేశంలో మూడువేల కట్టడాలు ఇటువంటి జాబితాలో ఉన్నాయని సంఘపరివార్ అంటూ ఉంది కనుక ఈ తవ్వకాల పని గంగా కావేరీ అనుసంధానం కన్నా పెద్ద ప్రాజెక్టు అవుతుంది.

పోనీ ఇదంతా చేసినా ఏమి తేలుతుంది? అక్కడ ఆలయమే ఉండేదని తెలినా, ఏమీ ఉండేది కాదని తెలినా అందువలన ఇవాళ్టి దేశ సమస్యలకు, నిత్య జీవిత సమస్యలకూ పరిష్కారమేదీ దొరకదు. ఫలానా రాజు, ఫలానా చక్రవర్తి, ఫలానా నవాబు ఇతరమత విశ్వాసాలను గౌరవించలేదు. లేదా గౌరవించాడు అనే ఒక మూడు - నాలుగు శతాబ్దాల కింది వాస్తవాన్నో, అవాస్తవాన్నో ఇవాళ గుర్తించినందువల్ల ఒరిగేదేమీ లేదు. ఆ నాలుగు వందల ఏళ్ళకింద ఒక తప్పిదం జరిగింది అని ఇవాళ గుర్తించినా ఆ తప్పిదాన్ని మార్చడానికి మరొక తప్పిదం చేయనక్కరలేదు.

ఆలయాలను, ప్రార్థనా స్థలాలను ధ్వంసం చేయడంలో మతం కన్న, ఆ ఆలయాలకు, ఆ ప్రార్థనా స్థలాలకు ఉన్న సంపద ఎక్కువ పాత్ర వహించిందని చరిత్రలో ఎన్నో అధారాలున్నాయి. కాశ్మీరులో ఒక హిందూరాజు సంపదకోసం హిందూ ఆలయాలను ధ్వంసం చేసి, దేవాలయ విధ్వంసకుడు అనేది తన బిరుదుల్లో ఒకటిగా పెట్టుకున్నాడు. హైందవ మతం తనకన్న ముందరి బౌద్ధ, జైన ప్రార్థనా స్థలాలను కూల్చి వాటి మీద దేవాలయాలు నిర్మించింది. కనుక తవ్వకాలు జరుపుతూ పోటే అంతిమంగా హైందవానికి గానీ, ఏ మతానికి గానీ సంబంధం లేని ప్రాచీన మానవ విశ్వాసాల ప్రతిమలో, ఆదిమ భయభక్తులో బయట పడతాయి. కనుక ఇవాళ తవ్వితే తేలేది అక్కడ రామాలయం ఉండేదా? లేదా? అని మాత్రమే కాదు. దాని కింద జైన మందిరమో, బౌద్ధాలయమో, ఇంకా సంఘటితం కాని ఏ మత విశ్వాసమో, చివరికి సరయూ నది తీరంలో నైసర్గికంగా బతికిన ఏ పశుపోషక ప్రాచీన వ్యవసాయక సామాజిక అవశేషమో బయట పడుతుంది.

మూడు, ప్రజల నిత్య జీవిత సమస్యలను పరిష్కరించలేని, కనీస అవసరాలు కూడా తీర్చలేని పాలక వర్గాలు ప్రజల దృష్టి మళ్ళించడానికి, భావోద్రేకాలను రెచ్చగొట్టి అసలు సమస్యలను మరిచిపోయేలా చేయడానికి వేస్తున్న ఎత్తుగడలలోని భాగమే ఈ తవ్వకాలు, నిజానికి ఈ వివాదాన్ని ప్రారంభించినప్పుడు బ్రిటిష్ పాలకులు ఏ దురుద్దేశాలతో ఎంత కుట్రపూరితంగా వ్యవహరించారో ఇవాళ్టి దాకా పాలకులందరూ అదే విధంగా వ్యవహరిస్తున్నారు.

విశ్వహిందూ పరిషత్ వాదనను బలపరిచే చరిత్రకారుడు డా॥ ఎస్.పి. గుప్తా కూడా "భారత పాలకులుగా బ్రిటిషు వారు రావడానికి ముందు రాసిన ఏ సాహిత్యాధారంలోనూ ఆ స్థలంలో ఆలయాన్ని కూలగొట్టారని ప్రస్తావన లేదు, అని రాశాడు. 1813లో జాన్‌లీడెన్ అనే బ్రిటిస్ చరిత్రకారుడు బాబర్ దండయాత్రా స్మృతులను ఇంగ్లీష్‌లోకి అనువదిస్తూ బాబర్ అయోధ్యను సందర్శించి ఉంటాడని మొదటిసారి రాశాడు. నిజానికి అప్పుడు కూడా బాబర్ అయోధ్య ప్రాంతపు హిందువుల సహాయంతోనే ముస్లింలైన పఠానులపై దాడి చేశాడు. 1856లో బ్రిటిష్ పాలకులు అయోధ్య రాజు వాజిద్ అలీషాను అక్రమంగా కూలదోసి తమ రాజ్యం ఏర్పరచినపుడు ఫైజాబాద్ ప్రాంతంలోని హిందూ-ముస్లింల మధ్య చీలికలు తేవడానికి బ్రిటిష్ అధికారులు రామాలయాన్ని కూల్చి బాబ్రీ మసీదును నిర్మించారని కట్టుకథ రాయడం మొదలుపెట్టారు. 1861లో బ్రిటిష్ ప్రభుత్వ సెటిల్మెంట్ ఆఫీసర్ పి. కార్నెజీ రాసిన ' ఎ హిస్టారికల్ స్కెచ్ ఆఫ్ ఫైజాబాద్ తెహసిల్', ఆ తరువాత ఎచ్.ఆర్.నెవిల్ రాసిన 'ఫైజాబాద్ డిస్ట్రిక్ట్ గెజిటీర్', ఆ తరువాత 1922లో ఏ.ఎఫ్.బివరిడ్జ్ చేసిన 'బాబ్రీనామా' అనువాదం ఈ కట్టుకథను పెంచి పోషించాయి.

విభజించి పాలించే కుటిల నీతిలో బ్రిటీష్ పాలకులు అనుసరించిన ఈ వ్యూహం ఆ తరువాత పాలకులకు ప్రజలను మోసం చేయడానికి, ఓట్ల రాజకీయాలలో ప్రజా సమూహాలను మత విశ్వాసాల మీద ఆకర్షించి తమ వెనుక నిలుపుకోవడానికి ఉపయోగపడింది. అందువల్లనే బాబ్రీ మసీదు- రామజన్మభూమి వివాదం ప్రారంభమైనప్పటినుండి ఇవాళ్టి దాకా అన్ని పార్లమెంటరీ రాజకీయ పార్టీలు అధికార పీఠం ఎక్కినప్పటికీ ఏ ఒక్కరూ ఈ సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయలేదు. పరిష్కరిస్తున్నట్లు నటించడంలో ఒకరితో ఒకరు పోటీపడ్డారు. 1949లో విగ్రహాల అక్రమ ప్రవేశాన్ని ఆమోదించిన ఫైజాబాద్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ కె.కె. నాయర్ ఆ తరువాత పదవికి రాజీనామా చేసి జనసంఘ్‌లో చేరినప్పటి నుండి ఇవాళ్టి దాకా అధికార యంత్రాంగం చాలా సందర్భాలలో హిందూ మతోన్మాదానికి అనుకూలతతో వ్యవహరిస్తోంది.

ఈ స్థితిలో నిష్పక్షపాతంగా, చట్టబద్ధంగా, ఆధార సహితంగా ప్రవర్తించవలసిన న్యాయస్థానాలు అధికారంలో ఉన్నవారి అడుగులకు మడుగులొత్తుతూ వారికి అనుకూలులయిన తీర్పులు ప్రకటిస్తున్నాయి. అటువంటి పాలక అనుకూల తీర్పుల సుదీర్ఘ జాబితాలో ఒక కొత్త చేర్పు లక్నో బెంచ్ తీర్పు. ❐

వ్యవసాయంలో (దా) రుణ సమస్య

(జాతీయ, అంతర్జాతీయంగా వస్తున్న ప్రైవేటీకరణ, ప్రపంచీకరణల ప్రభావంగా వ్యవసాయ రంగంలో రోజురోజుకు తీవ్రమౌతున్న సంక్షోభంపై ప్రముఖ వ్యవసాయర్థ శాస్త్రవేత్తలు, రైతు ఉద్యమ నాయకుల సర్వే నివేదిక నుంచి)

రైతులలో రుణభారం సమస్య చాలా తీవ్రంగా వున్నట్లు కమీషన్ వివిధ ప్రాంతాలను సందర్శించిన సందర్భంగా గమనించింది. అప్పులభారం అధికమైన రైతుల పరిస్థితి ముఖ్యంగా చిన్న, మధ్య కమతాల రైతుల స్థితి అత్యంత దయనీయంగా ఉన్నది. వారి పరిస్థితి ఎంత నిస్సహాయంగా వుందంటే పేరుకుపోయిన తమ అప్పులను తీర్చలేక కొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకోగా, మరికొందరు తమ శరీర భాగాన్నే (మూత్రపిండాలు) అమ్ముకోవడం వంటి తీవ్ర చర్యలకు పాల్పడుతున్నారు.

సమస్య దృక్కోణాలు :

1. రైతులకు వ్యవసాయ ఉత్పత్తికి అవసరమైన విత్తనాలు, ఎరువులు క్రిమిసంహారక మందులు, పరపతి సౌకర్యం వంటివి సరఫరా చేయడంలో ప్రభుత్వ పాత్ర నామమాత్రమే. తమ భూములలో సాగుచేసుకోవడానికి అనువైన పంటలను ఎంపిక చేసుకోవడం, ఆ పంటలకు ఏ మోతాదులో ఎరువులు, క్రిమి సంహారక మందులు వేయాలి వంటి విషయాలలో రైతులు విద్యావంతులను చేయడంలో ప్రభుత్వ వ్యవసాయ సాంకేతిక విస్తరణ శాఖ పూర్తిగా విఫలమయింది. మార్కెటింగ్ సౌకర్యాలు తగినంతగా లేవు. వినియోగదార్లు చెల్లించే ధరలో మధ్య దళారుల వాటాయే ఎక్కువ.

2. రాష్ట్రంలోని రైతులకు ప్రభుత్వ ఆర్థిక సంస్థల నుండి (బ్యాంకులు, సహకార సంఘాలు) అందినరుణ సదుపాయం కన్నా ప్రైవేటు వడ్డీ వ్యాపారులు వ్యక్తులు, మరియు ఇతర సంస్థల నుండి అందిన రుణాలే అధికమని ఈ అధ్యయనంలో తేలింది.

3. వినియోగదారావసరాలకంటే పంట ఉత్పత్తికోసం తీసుకున్న రుణమే అధికం. పంటల సాగుకు, సేద్యానికి అవసరమైన యంత్రాలు, పరికరాలు, బావులు, గొట్టపు బావులు త్రవ్వు కోవడానికి వాటిని మరింత లోతు చేసుకోవడానికి, పశువుల కొనుగోలుకు, భూమి అభివృద్ధి వంటి వాటికి రైతులు అప్పులు తీసుకున్నారు.

4. వడ్డీ వ్యాపారులు, ప్రైవేటు వ్యాపారులే రైతులకు ప్రధాన రుణదాతలు.

5. పంటలు పండకపోవడం, పంటసాగుకు ఎక్కువ ఖర్చులు కావడం, పరపతికోసం సంస్థలపై ఆధారపడటం, అధిక వడ్డీ రేటు, మార్కెటింగ్, నీటిపారుదల సౌకర్యాలు తగినంతగా లేకపోవడం, అధికంగా ఉన్న కౌలు, గతంలోని అప్పులు, తక్కువ ఆదాయాల వంటివి రైతుల రుణభారానికి ప్రధాన కారణాలు.

6. చిన్నరైతులు తమకు అవసరమైన అప్పులకోసం ప్రధానంగా వడ్డీవ్యాపారులపైనే ఆధరపడుతున్నారు. కౌల్దారులకు ఆర్థిక సంస్థల నుండి ఎలాంటి రుణాలు లభించడంలేదు. ఇది వారికి పెద్ద సమస్యగా మారింది.

7. రైతుల పరపతి అవసరాలలో సంస్థాగత వనరులు కేవలం 15 నుండి 20 శాతం మాత్రమే తీర్చగల్గుతున్నాయి. అందువల్ల మిగతా 80 నుండి 85 శాతం రుణాలను రైతులు ప్రైవేటు వర్గాల ద్వారా తీసుకోకతప్పడంలేదు.

8. ప్రభుత్వ సంస్థల రుణాల తిరిగి చెల్లింపునకు నిర్దేశించిన కాలవ్యవధి సముచితంగా లేదు. ప్రభుత్వ, ప్రైవేటు వర్గాలు అప్పుల వసూళ్ళకు కఠినమైన, మొరటు పద్ధతులు అవలంబిస్తున్న కారణంగా ఆ రుణాలను చెల్లించడానికి రైతులు తమ పంట ఉత్పత్తులను అయినకాడికి అతి తక్కువ ధరలకే అమ్ముకోకతప్పడం లేదు.

9. రైతులు తమ పంటలకు మంచి ధర లభించేవరకు సరుకు నిల్వచేసుకోవడానికి మార్కెట్ రుణాలు అవసరం. అయితే మార్కెట్ యార్డుల ద్వారా అలాంటి రుణ సౌకర్యం వీరికి ఏదీ లభించడంలేదు.

10. రైతులకు తెలియకపోవడంవల్ల చట్టవరంగా అనుమతించిన మేరకైనా రైతులకు రుణ నియంత్రణ చట్టం లాభాలు లభించడం లేదు. పైగా ఆ శాసనపరమైన చర్యలు సమగ్ర మైనవి కావు. సంబంధిత చట్టాలను అమలుచేసే యంత్రాంగం తగినంత సమర్థవంతంగా లేదు.

రైతుల అప్పులు ఎందుకు పేరుకుపోతున్నాయి?

1. సంస్థాగత రుణాల పంపిణీకి మౌలిక సదుపాయాలు కొరత :

ఆంధ్రప్రదేశ్‌లో 85 బ్యాంకుల (47 వాణిజ్య బ్యాంకులు, 22 సహకార బ్యాంకులు, 16 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు) ద్వారా రైతులకు రుణాల పంపిణీ జరుగుతున్నది. ఈ బ్యాంకులకు 5516 శాఖలున్నాయి. వీటిలో 4617 బ్యాంకు శాఖలు వ్యవసాయ రంగానికి పరపతి సౌకర్యం కల్పించే విషయంలో ముఖ్యమైన గ్రామీణ, చిన్నపట్టణ ప్రాంతాలలో వున్నాయి. ఈ బ్యాంకులన్నీ కలిపి 1997-98లో వ్యవసాయ రంగానికి కేవలం రు. 29'59.9 కోట్ల రుణాలు పంపిణీ చేశాయి. ఇందులో వాణిజ్య బ్యాంకులు 58 శాతం, సహకార బ్యాంకులు 38 శాతం మరియు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు 12 శాతం వంతున రుణాలు పంపిణీ చేశాయి. చిన్న రైతులకు కనీసం 65 శాతం, ఎస్.సిలకు 15 శాతం, ఎస్.టీ.లకు 6 శాతం వంతున రుణాలు పంపిణీ చేయాలని నాబార్డు నిర్దేశించింది. 1999-2000లో పరపతి అవసరం రూ. 8744.3 కోట్లుగా అంచనావేసి, ఇందులో రూ. 5013.6 కోట్లు పంట రుణాలు (57.3 శాతం) అవసరమని లెక్కించారు. వాణిజ్య బ్యాంకులు 63.4 శాతం, సహకార బ్యాంకులు 26.6 శాతంగా మరియు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు 13.0 శాతంగా రుణాలు ఇవ్వాలని నిర్దేశించారు. ఈ అంచనాలన్నీ ఎంతో ఆకర్షణీయంగా కన్పిస్తున్నా అవి రైతుల వ్యక్తిగత పరపతి అవసరాలలో (కేవలం 10-20 శాతం మాత్రమే. ఆ రుణాలు కూడా సకాలంలో రైతులకు అందడం లేదు. అయితే ఈ బ్యాంకులు ఆయా సంవత్సరాలలో ఇస్తున్న రుణాలలో అత్యధిక భాగం అంతకు ముందు తీసుకున్న పాత రుణాలను ఖాతా పుస్తకాలలో సర్దుబాటు చేసి పాత అప్పు తీర్చి కొత్త అప్పు ఇచ్చినట్లు వ్రాసినవే.

వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా వుండటంతో 1997-98లో పంటలు పండక ఎందరో పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ పంట నష్టాలను దృష్టిలో వుంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రైతులు నుండి రుణాల వసూళ్ళను వాయిదా వేసింది. రెండేళ్ళ మారటోరియంతోబాటు అసలు మొత్తాన్ని, వడ్డీని ఏడు వార్షిక వాయిదాలలో చెల్లించేలా రుణ వసూలును మార్పు చేశారు. గతం కన్నా కొంత అధిక మొత్తాలను రుణంగా ఇస్తామని ప్రకటించింది. డి.ఆర్.డి.ఎ. రుణం కింద అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు ఇచ్చే రుణాలకు వడ్డీని 4 శాతానికి తగ్గించారు. వాణిజ్య బ్యాంకులు రుణాలపై అపరాధ వడ్డీ వసూలు చేయరాదని రీ షెడ్యూలు చేసిన రుణాలపై చక్రవడ్డీ వసూలు చేయరాదని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్ష అజమాయిషీ లోని సహకార బ్యాంకులు రుణాల రీషెడ్యూలను చాలావరకు అమలుచేశాయి. అయితే వాణిజ్య బ్యాంకులు మరియు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు రాష్ట్ర ప్రభుత్వ ప్రకటననుసరైన స్ఫూర్తితో అమలు చేయలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా చెప్పిన ప్రకారం (23.8 1998 పత్రికా వార్తలు) వాణిజ్య బ్యాంకులు రు. 708.0 కోట్ల మేర రుణాలను వాయిదా వేయాల్సివుండగా కేవలం రు. 182 కోట్ల రుణాలను మాత్రమే రీషెడ్యూలు చేశాయి. అదే విధంగా 1998 ఖరీఫ్ సీజన్‌లో రూ. 3,000 కోట్ల మేర రైతులకు రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా, వాణిజ్య బ్యాంకులు కేవలం రు. 1149 కోట్ల రుణాలను మాత్రమే పంపిణీ చేశాయి. 1998-99లో రూ. 4,500 కోట్ల మేర రుణాలను పంపిణీ చేయాలని బ్యాంకులకు లక్ష్యంగా నిర్ణయించారు. వాణిజ్య బ్యాంకులు చేసిన బహిరంగ ప్రకటనలకు అనుగుణంగా వ్యవసాయ రంగానికి రుణాలు పంపిణీ చేయడంపై ఏమాత్రం ఆసక్తి చూపడం లేదనే సంగతి ఆచరణలో రుజువైంది. ఫలితంగా, రైతులు తమకు కావల్సిన రుణాల కొరకు వడ్డీవ్యాపారులు, ప్రైవేటు సంస్థలపై ఆధారపడటం అనివార్యమైంది. అంతేగాక, గత కొన్నేళ్ళుగా ఉత్పత్తి కారకాల ధరలు పెంచుతూనే వున్నందున రైతులు తీసుకునే ప్రైవేటు రుణాలు కూడా బాగా పెరిగాయి. సంస్థాగత రుణ సహాయం కౌల్దారులకు ఏమాత్రం అందడంలేదు.

రైతులకు రుణాల పంపిణీని మెరుగుపరచడానికై కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండేళ్ళ క్రితం ప్రకటించాయి. అయితే ఇది కొంత మేరకు అమలైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (2001) ఇటీవల విడుదల చేసిన వ్యూహ శ్వేత పత్రంలో ఈ ముఖ్యమైన చర్య గురించి మాట మాత్రంగానైనా ప్రస్తావించకపోవడం ఆశ్చర్యకరం.

ఈ పరిస్థితులలో, రైతులు గత్యంతరంలేక ప్రైవేటు వడ్డీ వ్యాపారులు, ఎరువులు, క్రిమిసంహారక మందుల విక్రేతల నుండి అధిక (24-12%) వడ్డీరేటకు అప్పులు తీసుకోవలసి వస్తోంది. ఈ వధంగా అప్పుకై సంస్థాగతేతర వర్గాలపై రైతులు ఆధారపడటం అధికమైంది.

2. ప్రతికూల వాతావరణ పరిస్థితులు :

కరువులు, అకాల వర్షాలు, వడగళ్ళవానలు, వరదలు, తుఫానుల రూపంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించడం సాధారణంగా మారింది. ఈ ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను బట్టి ఇది విస్తృత ప్రాంతాలపై కల్గించిన ప్రభావం వల్ల రైతులు భారీ నష్టాలకు గురయ్యారు.

3. నాణ్యతలేని ఉత్పత్తి కారకాలు :

రైతులకు నాసిరకం, నకిలీ విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఎరువులు ముఖ్యంగా సూక్ష్మపోషకాల ఎరువులు విక్రయిస్తున్నట్లు బహిరంగంగా గత కొన్నేళ్ళుగా ఫిర్యాదులు వస్తూనే వున్నాయి. రైతుల పంట నష్టాలకు గురి కావడంతో ఈ నకిలీ మందులు, ఎరువులూ, విత్తనాల వినియోగం కూడా ఓ ముఖ్య కారణమని, అవి తుదకు రైతుల ఆత్మహత్యలకు పాల్పడేలా

చేస్తున్నాయని కమీషన్ గుర్తించింది. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్య లకు కారణాలపై విశ్లేషణ జరిపిన నివేదికలన్నింటిలో ఈ విషయం ప్రముఖంగా ప్రస్తావించబడింది. ఆత్మహత్యలు చేసుకొన్న పత్తి రైతుల్లో 62 శాతం రైతులు నాసిరకం కల్తీ సస్యరక్షణ మందులు వాడటం వల్ల నష్టపడి చనిపోయారని "అవేర్" వారు నిర్వహించిన అధ్యయనంలో తేలింది. అదే విధంగా ప్రైవేటు విత్తనాల డీలర్లు (హైబ్రిడ్ విత్తనాలు) నాసికరం విత్తనాల సరఫరా చేయడంవల్లనే తమ కుటుంబ సభ్యులు ఆత్మహత్యలు చేసుకున్నారని 29 శాతం కుటుంబాలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 8 శాతం బాధిత కుటుంబాలు నాసిరకం కల్తీ ఎరువుల వాడకం వల్లనే తమ వారు నష్టపోయి ఆత్మహత్యలు చేసుకొన్నారని అభిప్రాయం వెలిబుచ్చారు. (మాధవన్ తదితరులు 1998)

అధికార యంత్రాంగం విత్తనాలు, ఎరువులు మరియు క్రిమి సంహారక మందులు పరిరక్షించడానికి చట్టాలున్నప్పటికి, రైతులకు నాణ్యతలేని ఉత్పాదకాల సరఫరాను నిరోధించడంలేదని తేలిపోయింది. దానికింద రూపొందించిన నియమ నిబంధనలు 1985 ఎరువుల నాణ్యత నియంత్రణ ఉత్తర్వు 1968 క్రిమి సంహారక మందుల నాణ్యత నియంత్రణ చట్టం దానికింద రూపొందించిన నియమ నిబంధనలు అమలులో ఉన్నప్పటికీ, రైతులకు నాణ్యమైన ఉత్పత్తి కారకాలు సరఫరా అయ్యేలా చూడటంలో ప్రభుత్వం విఫలమైంది. నాణ్యమైన మేలిరకం విత్తనాలు, ఎరువులు క్రిమిసంహారక మందులు సరఫరా చేయిస్తామని, కల్తీ సరఫరా విక్రేతల పై కఠిన చర్యలు తీసుకుంటా మని ప్రభుత్వం పలుమార్లు బహిరంగ ప్రకటనలైతే చేస్తోంది గానీ, ఆచరణలో అందుకు తగు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైంది.

క్రిమిసంహారక మందులు, సూక్ష్మ పోషక ఎరువులు, హైబ్రిడ్ పత్తి విత్తనాల పంపిణీ ప్రైవేట్ రంగం అధీనంలో వున్న విషయాన్ని గమనంలో ఉంచుకొని వాటి నాణ్యతను నియంత్రించ డంలో ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యాన్ని దృష్టిలో వుంచుకుంటే, ఏ అడ్డూ అదుపూలేని ప్రైవేటీకరణ విధానం రైతులకు ఎంత దారుణ భీభత్సాన్ని మరియు కష్ట నష్టాలను కలిగించినదో విదితమవుతున్నది. ప్రస్తుత వ్యవసాయ సంక్షోభంలో ఈ అంశానికి ఎంతో పాత్ర ఉన్నది. పైన పేర్కొన్నట్లుగా రుణ సహాయానికై రైతుల, ముఖ్యంగా చిన్న సన్నకారు రైతులు, తమకు కావలసిన విత్తనాలు, ఎరువులు మరియు సస్యరక్షణ మందులను అప్పుగా ఇచ్చే ప్రైవేటు వ్యాపారులపైనే ఆధారపడటంతో, ప్రస్తుత సంక్షోభంలో అనివార్యం గా నాసిరకం ఉత్పాదకాలు మరియు ప్రైవేటు రుణ అధిక వడ్డీలే ప్రధాన కారణమని భావించాలి.

4. అధ్వాన్నంగా వున్న వ్యవసాయ విస్తరణ :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయంపై రుపొందించిన కార్యాచరణ పత్రంలోనే వ్యవసాయ విస్తరణ సంస్థ పనితీరులో గల లోటుపాట్లు, లొసుగుల గురించి వివరమైన ప్రస్తావన వుంది. ఫలితంగా తమ అవసరమైన సాంకేతిక సహాయ సలహాల కోసం రైతులు ఎలాంటి సాంకేతిక అర్హతలు లేని మరియు లాభాపేక్ష ధ్యేయంగల ప్రైవేటు వ్యాపార వర్గాలపై ఆధారపడాల్సి వచ్చింది. ఆత్మహత్యలు చేసుకున్న రైతులలో కేవలం 11 శాతం మంది మాత్రమే రాష్ట్ర వ్యవసాయ శాఖ సిబ్బంది నుండి విస్తరణ సేవలు, సలహాలు పొందినట్లు మాధవన్ ప్రభృతులు (1998) పత్తి రైతుల ఆత్మహత్యలపై జరిపిన అధ్యయనంలో చెప్పారు. ఆత్మహత్యలు చేసుకున్నవారిలో 93 శాతం మంది పక్కరైతుల సలహాలమీద ఆధారపడ్డారు. మరణించిన రైతులలో 18 శాతం మంది క్రిమిసంహారక మందుల డీలర్లనుండి (సస్యరక్ష సమస్యలపై) సాంకేతిక సమాచారం, సలహాలు పొందారు. కొద్ది మంది రైతులు మాత్రమే ఎలక్ట్రానిక్, ప్రసార మాధ్యమాల ద్వారా అందిన సలహాలను పాటించారు. ఈ సమాచారాన్ని బట్టి రాష్ట్ర వ్యవసాయ శాఖ రైతులకు అందించే విస్తరణ సేలు అధ్వాన్నంగా ఉండడంతో రైతులు తమ పంటల సాగుకు అవసరమైన సాంకేతిక సలహాల కోసం ఇతర వర్గాలపై ఆధారపడినట్లు స్పష్టమవుతున్నది. మన దేశంలో వ్యవసాయ సాంకేతిక నైపుణ్యం ప్రధానంగా ప్రచార సాధనాల ద్వారాగాక, రైతుల నుండి రైతులకు విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. పంటలకు సోకిన చీడపీడల అదుపు చేయడానికి సరైన సలహాలనిచ్చే బదులు ప్రైవేటు డీలర్లు అమ్ముడుపోని తమ నిల్వ విక్రయాలపైనే ఆసక్తి చూపుతూ, రైతులకు నిష్పక్షపాతమైన సలహా లివ్వటం లేదు. డీలర్లు మందులు అప్పుగా ఇవ్వడంవల్ల చిన్న, సన్నకారు రైతులు వారిపై ఆధారపడుతూ అనుచిత సలహాలు పొందుతూ కష్ట, నష్టాలకు గురవుతున్న విషయాన్ని అర్థం చేసుకోవలసి వుంది. వారికి ప్రత్యామ్నాయం కూడా అందుబాటులో లేదు. ఈ పరిస్థితులలో వ్యవసాయ రంగంలోని ప్రస్తుత సంక్షోభానికి సాంకేతిక నైపుణ్యాన్ని అమలు చేయడంలో గల లోపాలు ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. అందువల్ల వ్యవసాయ రంగంలోని ప్రస్తుతం సంక్షోభానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ అసమర్థ పని విధానం కూడా ప్రధాన కారణం. పంట నష్టాల ఫలితంగా రైతుల అప్పు భారం పెరిగింది.

5. విద్యుత్ సరఫరాలో సమస్యలు :

రాష్ట్రంలో 1997-98లో మొత్తం 49.44 లక్షల హెక్టార్ల సాగునీటి విస్తీర్ణంలో బావులు (బావులు, బోర్లు) ద్వారా సాగయ్యే భూమి 16.77 లక్షల హెక్టార్లు. కాలువల (నీటిపారుదల ప్రాజెక్టుల) ద్వారా 15.37 లక్షల హెక్టార్లు, చెరువుల ద్వారా 5.2 లక్షల హెక్టార్ల భూమికి సాగునీరు లభిస్తున్నది. బావుల కింద ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ పంటలు సాగుచేయడాన్ని బట్టి ఇతర వనరులతో పోలిస్తే మొత్తం నీటి సాగు విస్తీర్ణం 51.58 లక్షల హెక్టారులో, సేద్యపు బావుల కింద నీటిసాగు విస్తీర్ణమే అత్యధికంగా ఉన్నది. బావుల కింద పంటసాగుకు విద్యుత్ అవసరం. పంటల ఉత్పత్తిలో

సాగునీరు అత్యంతకీలకమనే సంగతి గుర్తించిన రైతులు ముఖ్యంగా తీవ్ర దుర్భిక్షానికి గురవుతున్న ప్రాంతాలలోని చిన్న, సన్నకారు రైతులు వీలున్నచోటల్లా భారీ మొత్తాలను అప్పులుగా తెచ్చి, లేదా తమ ఆస్తులను అమ్ముకుని బావులతో నీటి సాగుకు ఖర్చు చేశారు. రాష్ట్రంలో 20 లక్షలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే, వాస్తవంలో ఎన్ని బావులకు విద్యుత్ సరఫరా చేస్తున్నది ఎ.పి. ట్రాన్స్‌కోకు కూడా తెలియదు.

భూగర్భజలాలను అధికంగా వినియోగిస్తుండటంవల్ల భూగర్భజలాల మట్టం వేగంగా తగ్గిపోతున్న దరిమిలా ప్రస్తుత బావులను మరింత లోతు చేసుకోవడానికి లేదా కొత్త బోర్లు వేసుకోవడానికి రైతులు మరింత పెట్టుబడి పెట్టవలసిన అవసరం ఏర్పడిందన్న విషయాన్ని ఈ కమీషన్ గమనించింది. అదే విధంగా విద్యత్ సరఫరా సక్రమంగా లేకపోవడం వల్ల (లోవోల్టేజీ, సరఫరాలో అంతరాయాలు) పంట పెరిగే సమయంలో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తరచుగా కాలిపోతుండటం, ఫలితంగా పూర్తిగానో లేక పాక్షికంగానో పంటలను నష్టపోవడం కమీషన్ దృష్టిలోకి వచ్చింది. ఈ విధంగా మోటార్లు కాలిపోవడంవల్ల చిన్న, సన్నకారు రైతులతోబాటు మధ్యతరగతి రైతులు సైతం పంటలు కాపాడుకోవడానికి విధిలేక అన్ని షరతులకు ఒప్పుకుని వ్యాపారుల నుండి అప్పులు తెచ్చుకుంటున్నారు. దీనివల్ల కోలుకోలేని రుణభారంతో ఈ రైతులు దుర్భలులై కృంగిపోతున్నారు. బావుల కింద సేద్యం చేస్తున్న రైతుల దుస్థితికి వారు రుణభారం ఊబిలో కూరుకుపోవడానికి విద్యుత్ సరఫరా సమస్యలే ముఖ్యకారణమని స్పష్టమవుతున్నది. ప్రభుత్వం ప్యాకేజీ పథకం ద్వారా, చట్టం రూపేణా ఆదుకొని విద్యుత్ సరఫరా సమస్యలను తొలగించకపోతే రైతులు ప్రస్తుత రుణభారం నుండి బయటపడి కోలుకునే పరిస్థితులు ఎంత మాత్రం లేవు.

6. గిట్టుబాటు ధరలు లేకపోవడం :

ద్రవ్యోల్బణం అప్పుడప్పుడు ఏర్పడేదిగాక నిత్యం అదే ధోరణిలో కొనసాగుతోంది. అయితే, ప్రతి సంవత్సరం దీనిలో హెచ్చు తగ్గులు ఉండవచ్చు. ఒకేసారి పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చులు మరియు ఉత్పత్తుల వల్ల రైతులకు లాభం లేదా నష్టం జరిగిందా అని కేవలం పెరుగుతున్న ఉత్పత్తుల ధరల ఆధారంగా చెప్పలేం. వ్యవసాయ, వ్యవసాయేతర వస్తువుల మధ్య మారుతున్న ధరల సరళి ఇందుకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తుంది. అయితే, రైతుల వాస్తవ ఆదాయం చిల్లర ధరల మీద ఆదారపడగా, వ్యవసాయ ఉత్పత్తుల ధరల సూచి లెక్కించేటప్పుడు టోకు ధరలకే ఆధారంగా తీసుకుంటారు. చిల్లర ధరలు టోకు ధరలకన్నా అధికంగా ఉంటాయని అందరికీ తెలుసిందే. అందువల్ల ప్రస్తుతం లెక్కించే వ్యవసాయ ధరల సరళి సూచి (టర్మ్ ఆఫ్ ట్రేడ్ సూచి) వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవించేవారి సారూప్య వాస్తవ ఆదాయాన్ని సూచించదు. ఈ విధంగా లెక్కించిన సూచి కృత్రిమంగా రైతుల ఆదాయాన్ని అధికంగా చూపుతుంది. దీనిని సరిచేయాలి.

వ్యవసాయ వ్యయం, ధరల కమీషన్ లెక్కించిన గణాంకాల ప్రకారం (1971-72 ఆధారం = 100 పాయింట్లు) 1994-95లో 91.8గా వున్న వ్యవసాయ ధరల సరళి సూచి 1995-96 నాటికి 90.2కు తగ్గింది. (సిఎసిపి, 2000). 1971-72 ప్రామాణికంగా తీసుకొని, ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాలలో ఉత్పత్తుల ధరలతో పోల్చినపుడు, వ్యవసాయోత్పత్తుల ధరలు అంత అనుకూలంగా లేవని స్పష్టమవుతున్నది. మరో మాటలో చెప్పాలంటే, ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాలతోపోలిస్తే, వ్యవసాయం సాగిస్తున్న వారికి తక్కువ ఆదాయం లభిస్తున్న విషయం సుస్పష్టమవుతున్నది. 1990-91 తో ముగిసిన త్రైవార్షిక కాలంలో సగటు ధరల నిష్పత్తి 87.6 శాతం కాగా, 1997-98తో ముగిసిన త్రైవార్షిక కాలంలో అది 90.4. ఆర్థిక గణాంకాల డైరెక్టరేట్ ప్రకారం 1994-95తో పోలిస్తే 1995-96లో రైతులకు లభించే ధరలు 6.8 శాతం పెరగగా, రైతులు చెల్లించవలసిన ధరలు మాత్రం 8.3 శాతం పెరిగాయి. అదే విధంగా ఇదే కాలంలో వస్తువుల తుదివినియోగం, మధ్యంతర వినియోగం మరియు మూలధనంగా మారిన వాటి ధరల సూచీలు వరుసగా 9.2, 4.9 మరియు 11 శాతం పెరిగాయి. ఇది జాతీయ స్థాయి పరిస్థతి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ పరిస్థితి మరింత అధ్వాన్నంగా వుంది.

దేశంలోని సగటు ఉత్పత్తి వ్యయంతో పోలిస్తే 1999-2000 లో కూడా ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న, పెసర, మినుము మినహా ఇతర పంటల ఉత్పత్తి ఖర్చు అధికంగా రాష్ట్రంలో వున్నట్లు తేలింది. వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు చెల్లించినట్లు భావించారు.

ఆంధ్రప్రదేశ్‌లో సరాసరి ఉత్పత్తి ఖర్చు

(జాతీయ సరాసరి ఉత్పత్తి ఖర్చు బ్రాకెట్టుల ఇవ్వబడింది)

వరి	రూ.	468.52	(424.15)
పత్తి	రూ.	1761.61	(1586.44)
జొన్న	రూ.	562.69	(424.23)
మొక్కజొన్న	రూ.	534.66	(554.91)
పెసర	రూ.	1182.04	(1247.13)
మినుములు	రూ.	11.04.33	(1155.30)
వేరుశనగ	రూ.	1432.04	(1260.34)
పొద్దు తిరుగుడు	రూ.	1178.15	(1144.95)

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పెసర, మొక్కజొన్న మినహా ఇతర ముఖ్యపంటల ఉత్పత్తి వ్యయం ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా వుంది.

వ్యవసాయ వ్యయాలు, ధరలు కమీషన్ గణాంక వివరాలను పరిశీలిస్తే, ఈ విషయం స్పష్టమవుతుంది. ఆ వివరాలు ఈ క్రింది పట్టికలో ఇవ్వబడ్డాయి.

పోటీపడే ఇతర రాష్ట్రాలతో పోలిస్తే, ఆంధ్రప్రదేశ్‌లో 1996-97లో పంటల ఉత్పత్తి వ్యయం (క్వింటాలకు రూపాయలలో)

వరి	448.3 (ఆంధ్రప్రదేశ్)	340.1 (ఉత్తర ప్రదేశ్)	384.7 (పంజాబ్)	449.8 (మహారాష్ట్ర)
పత్తి	2016.2 (ఆంధ్రప్రదేశ్)	1513.1 (గుజరాత్)	1703.7 (మమారాష్ట్ర)	1930.1 (పంజాబ్)
	1928.8 (మధ్యప్రదేశ్)	1100.0 (రాజస్థాన్)		
జొన్న	591.1 (ఆంధ్రప్రదేశ్)	568.0 (మధ్యప్రదేశ్)	474.0 (తమిళనాడు)	
మొక్కజొన్న	545.6 (ఆంధ్రప్రదేశ్)	647.8 (మధ్యప్రదేశ్)	549.3 (రాజస్థాన్)	575.6 (ఉత్తర ప్రదేశ్)
పెసర	1263.8 (ఆంధ్రప్రదేశ్)	1264.4 (మహారాష్ట్ర)	1649.0 (ఒరిస్సా)	
మినప	1446.8 (ఆంధ్రప్రదేశ్)	1064.7 (మధ్యప్రదేశ్)	1091.7 (మహారాష్ట్ర)	1115.1 (ఒరిస్సా)
	1188.2 (తమిళనాడు)			
వేరుశనగ	1374.6 (ఆంధ్రప్రదేశ్)	997.7 (గుజరాత్)	1354.6 (మహారాష్ట్ర)	1142.9 (ఒరిస్సా)
	1123.4 (తమిళనాడు)			
పొద్దుతిరుగుడుపువ్వు	1154.9 (ఆంధ్రప్రదేశ్)	1218.8 (మహారాష్ట్ర)	910.0 (పంజాబ్)	

ధరలస్థాయిని నిర్ణయించేది జాతీయ మార్కెటే గనుక, దేశంలోని ఇతర ప్రాంతాల రైతులతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ రైతులకు తక్కువ ఆదాయం లభిస్తున్న సంగతి విదితమవుతున్నది. అందువల్ల, కొన్ని సంవత్సరాలలో మామూలుగా పంటలు పండినా, దేశంలోని ఇతర ప్రాంతాల రైతులకు లభించే ఆదాయంతో పోలిస్తే, ఆంధ్రప్రదేశ్ రైతులకు లభించే ఆదాయం తక్కువే.

ఆంధ్రప్రదేశ్ రైతులకు అప్పులభారం అధికమై మరింత తీవ్ర దుస్థితికి గురికావడాన్ని ఈ దృష్టికోణం నుండి కూడా అవగాహన చేసుకోవలసి ఉంది.

7. ప్రపంచ మార్కెట్‌లో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అసమాన (అనుచిత) పోటీ

మన దేశం ప్రపంచ వాణిజ్య సంస్థలో సభ్యురాలిగా చేరాక వ్యవసాయ ఉత్పత్తులతో సహా వివిధ వస్తువుల వ్యాపారం, భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరణ ప్రభావానికి గురైంది. అందువల్ల, అంతర్జాతీయ ధరలు దేశంలో వ్యవసాయోత్పత్తులపై తీవ్ర ప్రభావాన్ని కల్గిస్తున్నాయి.

వివిధ వ్యవసాయోత్పత్తుల ధరల ధోరణి 1990 నుండి తగ్గుతున్నట్లు ప్రపంచ బ్యాంకు 1999 వాణిజ్య నివేదికలో పేర్కొన్నది. అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గిపోవడం (ధరల మాంద్యం) దేశీయ మార్కెట్ పంటల ధరలు తగ్గడానికి దారితీసింది. ఇది భారత రైతులకు అననుకూలం.

విదేశాల నుండి చౌకగా ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోవడం రైతుల జీవనానికి ముప్పుగా పరిణమించింది. పాడి, కోళ్ళ పరిశ్రమ రైతులు కూడా ఇదే విధంగా తీవ్ర పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సర్దుబాటు విధానాలను అమలు చేస్తున్న కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి కారకాల ధరలు, ముఖ్యంగా విత్తనాలు, ఎరువులు, విద్యుత్, సాగునీటి ఛార్జీలు పెరుగుతూనే ఉన్నాయి. అందువల్ల దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ శక్తుల అసమాన, అనుచిత పోటీలో రాష్ట్ర రైతులు నలిగిపోతున్నారు. రాష్ట్ర రైతుల రుణభారం పెరిగిపోవడాన్ని ఈ పూర్వరంగంలో ఈ దృక్పథం నుండి అవగాహన చేసుకోవాలి.

ఆంధ్రప్రదేశ్‌లో రుణ విమోచన

(1) ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రుణ విమోచన చట్టం (1987), ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రుణ విముక్తి నిబంధనలు, 1988 (ఆహార వ్యవసాయశాఖ వారి జీ.వో.నెం. 629), తేదీ 12-8-89 ద్వారా 31-5-1998 నాటికి వ్యవసాయ కార్మికులు, గ్రామీణ వృత్తిపనివారు, చిన్న రైతులకు పేరుకుపోయిన రుణాలన్నిటినీ రద్దు చేయడం జరిగింది. రాజ్యాంగం 46వ అధికరణంలో నిర్దేశించిన సూత్రాల అమలు కోసం రుణ విమోచన చట్టం సెక్షన్ - 2 క్రింద ఈ రుణాలను రద్దు చేయడం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, స్థానిక సంస్థలకు లేదా, సహకార సంఘాలకు, బ్యాంకులకు, ప్రభుత్వ కంపెనీలకు

చెల్లించవలసిన మొత్తాలను ఈ రుణ విమోచన నుండి మినహాయించారు. ఈ చట్టం మేరకు నగదుగా గాని లేదా వస్తురూపంలో గాని తీసుకున్న ఇతర అన్ని రుణాలను రద్దు చేశారు.

(2) రుణ విమోచన చట్టం మేరకు రెండున్నర ఎకరాల మాగాణి లేదా 5 ఎకరాల మెట్టభూమిని (ఎస్.టి.ల విషయంలో అయితే పదెకరాలు) కలిగి, వార్షిక ఆదాయం రూ. 12,000 మించకుండా, సేద్యం నుండి వచ్చే ఆదాయమే ప్రధానా దాయమయితే రుణ విమోచన చట్టం వర్తిస్తుంది. ఈ రుణ విమోచన చట్టం క్రింద రుణం తీసుకున్నప్పుడు రైతల స్థాయినే కోర్టులు అర్హతకు ప్రాతిపదికగా తీసుకున్నాయి.

(3) ఆంధ్రప్రదేశ్ రుణభార (విమోచన) 1977 చట్టం 30-12-1976 వరకు ఉన్న రుణాలకు మాత్రమే వర్తిస్తుంది. 1987 చట్టం 1977 చట్టానికి కొనసాగింపు మాత్రమే. ఇంతకు ముందు తెలంగాణాలో 1956లో, ఆంధ్ర ప్రాంతంలో 1959లో ఈ రుణ విమోచన చట్టాలను అమలు చేశారు. ఈ చట్టాల క్రింద రుణ విమోచన పొందగోరే చిన్న రైతులు, గ్రామీణ వృత్తిపనివారు, వ్యవసాయ కూలీలకు ఎన్నో నియమ నిబంధనలను విధించి నందున, తీవ్ర దుస్థితిలో వున్న రైతులకు అంతగా ప్రయోజనం కలుగలేదు. నిజానికి, వారంతా రుణ విమోచనకు అర్హులే.

(4) భారత ప్రభుత్వం కూడా 1980లో జాతీయ బ్యాంకులు, సహకార బ్యాంకులకు రైతులు, ఇతర గ్రామీణ వృత్తుల వారు చెల్లించవలసిన రుణాలను (గరిష్టంగా రూ. 10,000కు లోబడి) రద్దు చేసింది. అయితే ఇది పలుకుబడి కల్గిన పెద్ద రైతులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చింది. అధికారులు మాత్రం పేదలు, చిన్న రైతుల వెంటబడి బలవంతంగా రుణాల వసూళ్ళకు పూనుకోవడం వల్ల, పేదవారికి ఈ చట్టం ప్రయోజనం కలుగలేదని విమర్శలు వచ్చాయి.

ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాలలో మొండి బాకీలను వసూలు చేయడంలో భాగంగా రిజర్వుబ్యాంకు 2002 జనవరిలో వాణిజ్య బ్యాంకులకు వర్తించేలా వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఏక మొత్తం వసూలు)ను ప్రకటించింది. దీని ప్రకారం చిన్న రుణాలపై (రైతులకిచ్చిన రుణాలకు కూడా వర్తిస్తాయి) బ్యాంకులు వడ్డీ మాఫీ చేసి, అసలు మొత్తాన్ని మాత్రమే వసూలు చేస్తాయి.

ఇదేగాక, 2002-03 కేంద్ర బడ్జెట్‌లో చిన్న, సన్నకారు రైతులకు ప్రత్యేక వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఒకే దఫా బాకీల పరిష్కారం) పథకాన్ని ప్రకటించారు. రూ. 50,000 వరకు గల రుణాలకు వర్తించే ఈ పథకాన్ని భారత రిజర్వుబ్యాంకు రూపొందిం చింది. గతంలోని అనుభవాలను బట్టి ఈ పథకాన్ని వాణిజ్య బ్యాంకుల మొండి బాకీల వసూలు కోసం ఉద్దేశించినట్లు కన్పిస్తోంది. అందువల్ల, ఈ పథకాన్ని సహకార బ్యాంకుల రునాలకు కూడా వర్తింపజేయాలని ఈ కమీషన్ సిఫార్సు చేస్తున్నది. రాష్ట్రాలు ఈ పథకాన్ని సహకార రంగ రుణాలకు కూడా వర్తింపజేయడానికి వీలుగా రిజర్వుబ్యాంకు / భారత ప్రభుత్వం అవసరమైన సహాయాన్ని అందజేయాలి.

బకాయిల చెల్లింపు అలవాటు

మోహన్‌కందా (1998) ఆంధ్రప్రదేశ్‌లో వివిధ వర్గాలకు చెందిన రైతుల యొక్క బకాయిలు చెల్లించే అలవాటు (84 శాతం) పెద్ద (82 శాతం) మరియు మధ్య తరగతి (77 శాతం) రైతుల కన్నా అధికంగా ఉన్నట్లు గమనించారు. ప్రభుత్వ సంస్థల నుండి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లిచడంలో రైతులు విఫలమవు తున్నారు. ఆశించిన దానికన్నా దిగుబడి తగ్గిపోవడం, పడిపోయిన మార్కెటు ధరలు మరియు ప్రకృతి వైపరీత్యాలు ప్రధాన కారణాలుగా ఈ అధ్యయనంలో గుర్తింపబడ్డాయి. పంటకోసిన తరువాత రుణం తిరిగి చెల్లించడానికి ఉన్న అతికొద్ది గడువు మరియు అమ్మిన సరుకును కొన్నవారు ఆలస్యంగా చెల్లించడం కూడా బాకీ చెల్లింపులలో ఆలస్యానికి ముఖ్యకారణాలుగా గుర్తించ బడ్డాయి.

ఫలితంగా, ఆంధ్రప్రదేశ్ రైతులు రుణభారంతో కృంగి పోతున్నారు. రుణభారానికి కారణం కేవలం పంటలు పూర్తిగా లేదా పాక్షికంగా పండకపోవడం కాక, పైన వివరించిన విధంగా ఎన్నో కారణాలు ఉన్నాయి. దీనికితోడు ఆధునిక సేద్యంలో పెట్టుబళ్లు కూడా అధికంగా ఉన్నవి. అందువల్ల సేద్యంలో రిస్కు కూడా హెచ్చుగా ఉన్నది. ఈ సందర్భంలో ఎంతో ఉపయోగపడాల్సిన పంటల బీమా రైతులకు ఉపయోగపడటం లేదు. పంటల బీమా పథకాన్ని ఉపయోగపడే విధంగా ఎంతో మార్చాల్సి ఉంది.

పెట్టుబడి లేకుండా ఆధునిక సేద్యం ఊహకందనిది. అయితే, రైతులకు ఆర్థిక సంస్థల నుండి అందే పెట్టుబడి అవసరమయిన దానిలో 10-20 శాతం మాత్రమే. కౌలు రైతులకు ఇది కూడా అందుబాటులో లేదు. వీరంతా మిగతా అవసరమైన పెట్టుబళ్ళకు ప్రైవేటు పెట్టుబడిదారులు మరియు ఉత్పాదక వ్యాపారస్తుల మీద ఆధారపడాల్సి వచ్చింది. వీరు అధికంగా వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇతర విషమ షరతులకు కూడా రైతులు ఒప్పుకోవాల్సి వస్తుంది. అందువల్ల, రైతులకు సేద్యానికి అవసరమయిన పూర్తి పెట్టుబడి అందేలా ప్రభుత్వ ఆర్థిక సంస్థలను అభివృద్ధి పరచాలి. రైతులకు క్రెడిట్‌కార్డులనిచ్చి, అప్పు ఇచ్చే పద్ధతిని రైతులకు అనుకూలంగా మార్చవచ్చు. అదే విధంగా, ప్రైవేటు

అప్పులు పెట్టే వారిని నియంత్రణ చేయడానికి ప్రస్తుతం ఉన్న వడ్డీ వ్యాపార చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి.

పై కారణాలన్నిటి దృష్ట్యా, రైతుల్లో, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతుల్లో, రుణ భారం అధికంగా ఉన్నది. వారి అప్పులు వారి ఆస్థిలో గణనీయ భాగానికి మించిపోయే స్థితిలోనో ఉన్నాయి. ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల అధిక వడ్డీని తీసుకోవమోగాక, రైతుల వారికి తమ ఉత్పత్తులను కారుచవకగా అమ్మాల్సిన దుస్థితి ఉన్నది. పంటలను కాపాడటానికి, ఏపిట్రాన్స్కో కూడా విద్యుత్ సరిగ్గా సరఫరా చేయడంలో విఫలమయింది. విద్యుత్ సరఫరాలో లోపాలు కూడా రైతులు నష్టాలకు ప్రధాన కారణంగా మారాయి. అందువలన, రైతులు తీవ్ర దుస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారుతున్న ఆర్థిక విధానాలు కూడా రైతాంగాన్ని నష్టపరిచేవిగా ఉంటున్నాయి.

ప్రభుత్వ విధానాలే వ్యవసాయ ఉత్పత్తికి అవసరమయిన అన్ని ఉత్పాదకాల ధరలను పెరగడానికి కారణమవడం దురదృష్టకరం. వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాల వల్ల వచ్చిన ఆదాయం ఈ పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు కూడా భరించేవిగా లేకపోవడంతో, రైతులు నష్టపోతున్నారు. ఇదే సమయంలో, ధరలు పెరగడంతో, రైతుల కుటుంబ ఖర్చులు, అవసరాలు కూడా పెరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు అన్ని ప్రధాన పైర్ల ఉత్పత్తి ఖర్చు అధికంగా ఉన్నా, అవి అమ్మగా వచ్చే నికర ఆదాయం మిగతా రాష్ట్రాల రైతులకన్నా తక్కువ స్థాయిలో ఉన్నది. రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ దుస్థితికి గల కారణాలను లోతుగా అధ్యయనం చేసి, తగిన పరిష్కార మార్గాలను చూపెట్టాలి. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న అసమాన అంతర్జాతీయ పోటీ నూతన సమస్యలను సృష్టిస్తున్నాయి. అందువల్ల, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు రైతులకు సహాయకారిగా ఉండేలా మారాలి.

ప్రస్తుతం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన నిస్సహాయ పరిస్థితుల నుండి రైతులకు కనీస ఉపశమనం అందాలంటే ఈ కింది చర్యలు తక్షణమే అవసరమని కమీషన్ భావిస్తున్నది.

1. రాజ్యాంగం ప్రకారం రుణవిముక్తి అనేది రాష్ట్ర జాబితాలో ఉంది. ఈ విషయంలో కేంద్రం ఏ విధంగానూ జోక్యం చేసు కోవడానికి వీలులేదు. ఈ రాష్ట్రాల హక్కును కేంద్ర ప్రభుత్వం బ్యాంకింగ్ నియంత్రణ చట్టాన్ని సవరించడం ద్వారా హరించి వేసింది. బ్యాంకింగ్ నియంత్రణ చట్టాన్ని మళ్ళీ సవరించి ఈ విషయంలో యధాతధ స్థితిని పునరుద్ధరించడం ద్వారా రుణ విముక్తి విషయంలో రాష్ట్రాల హక్కులను పునరుద్ధరించాలి.

2. రుణభారానికి గురయిన రైతుల విషయంలో వడ్డీ, అపరాధ వడ్డీ కలిసి అసలు కన్నా రెండు మూడు రెట్లు ఎక్కువ య్యాయి. అందువల్ల రైతుల రుణాలను ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రాంత) వ్యవసాయ దారుల సహాయ చట్టం 1938లోని సెక్షన్ 9, 13 ల ప్రకారం నియంత్రించాలి. ఈ చట్టాన్ని అమలు చేయడం ప్రభుత్వ కనీస కర్తవ్యం. అంటే అప్పులన్నింటినీ ఐదుశాతం సాధారణ వార్షిక వడ్డీరేటుకు తగ్గించడం, ఇప్పటి వరకూ అదనంగా చెల్లించిన వడ్డీని అసలులో లెక్కగట్టడం, మిగిలిన రుణాన్నే చెల్లించవలసిన రుణంగా చూపడం జరగాలి.

(పై రెండు సిఫారసులను కలిపి చదవాలి)

3. ఐదు ఎకరాల మాగాణి, 10 ఎకరాల మెట్టలోపు ఉండే రైతు లందరి రుణాలను - ప్రైవేటు వడ్డీ వ్యాపారులపైనా, ఉత్పాదకాల వ్యాపారులవైనా (సంస్థేతర ద్రవ్య వనరులు), సహకార సంస్థలతో సహ ప్రభుత్వం నడిపే ద్రవ్య సంస్థలపైనా - మొత్తంగా మాఫీ చేసి, తక్షణ ఉపశమనం కలిగించాలి.

రైతుల రుణభారం సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలంటే :

4. వ్యవసాయ విద్యుత్ సరఫరా సమస్యలన్నింటికీ ఎపిట్రాన్స్కో మీద బాధ్యత మోపి, మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి నప్పుడు కలిగే నష్టాన్ని పూడ్చుమని కోరాలి.

5. రైతులకు అవసరమైన పరపతి సౌకర్యాలను పూర్తిగా సరైన సమయంలో తీర్చేలా ప్రభుత్వ ద్రవ్యసంస్థలను బలోపేతం చేయాలి. రుణ అనుమతి తతంగాన్ని సులభతరం చేసేందుకు కౌలుదార్లతో సహా రైతులందరికీ క్రెడిట్ కార్డులు ఇవ్వాలి.

6. వ్యవసాయ రంగానికి అవసరమైన సేవగా సమర్థమైన పంటల భీమా పథకాన్ని ప్రవేశపెట్టి రైతులందరినీ, పంటలన్నిటినీ దాని పరిధిలోకి తీసుకురావాలి. సొంత నిధులతో వ్యవసాయం చేసినా, అప్పుతెచ్చి వ్యవసాయం చేసినా, బీమా పరిదిలోకి తేవాలి.

7. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు వంటి ఉత్పాద కాలను సరసమైన ధరలకు నాణ్యంగా సరఫరా చేసేందుకు గాను ఉన్న చట్టాలను బలోపేతం చేసి సక్రమంగా అమలు చేయాలి.

8. ప్రభుత్వపు విస్తరణ సేవల విభాగాన్ని బలోపేతం చేయడం ద్వారా ఉత్పాదకాల వ్యాపారులు అక్రమాలకు రైతులు గురించి కాకుండా చూడాలి. ఒక జవాబుదారీ సంస్థ ద్వారా రైతులకు నిష్పాక్షిక స్వార్థరహిత సాంకేతిక పరిజ్ఞాన సలహాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

9. సమర్థమైన మార్కెట్ జోక్యం ద్వారా ప్రపంచ మార్కెట్ శక్తుల మార్కెట్ పోటీ నుంచి రైతుల, వినియోగదారుల ప్రయోజ నాలను పరిరక్షించాలి. ❒

రామ జన్మభూమి బాబ్రీ మసీదు వివాదం

- డి. పాపారావు

రామ జన్మభూమి-బాబ్రీ మసీదు వివాదం ఇవాళ దేశ రాజకీయ, సామాజిక రంగాలను తీవ్రంగా ప్రభావితం చేస్తూ ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా ఈ వివాదానికి సంబంధించిన మూలాలను శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించి అర్థం చేసుకోవాల్సి ఉంది. మతపర అంశాలు న్యాయ నిబద్ధత మీద కన్నా, విశ్వాసాల మీద ఆధారపడే ప్రజల మనస్సులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. కావున, ఈ విషయంలో మరింత జాగ్రత్తగా విషయాలను పరిశీలించి, అర్థం చేసుకోవాల్సి ఉంది. పై విషయాలను మనస్సులో పెట్టుకుని మనం రామ జన్మభూమి బాబ్రీ మసీదు వివాదపు లోతుల్లోకి వెళదాం.

అయోధ్య గురించి చర్చించినపుడు మొదటగా తలెత్తే ప్రశ్న అసలు రాముడు ఉంటే, అతను పరిపాలించిన అయోధ్య ఇదేనా? ఈ ప్రశ్నకు సమాధానం కోసం తగిన చారిత్రక ఆధారాలను పరిశీలించాల్సి ఉంది. రాముని గురించి తొలుత ప్రస్తావించిన రామకథ ప్రస్తుతం అందుబాటులో లేదు. ఈ రామకథకు కావ్యరూపం ఇచ్చి 'వాల్మీకి' రామాయణం రచించాడు. రామాయణం కావ్యం కాబట్టి ఇందులో పలు స్థలాలు, పాత్రలు కేవలం కల్పితమే కావచ్చు. అంతే కాకుండా వాల్మీకి వ్రాసిన రామాయణం ప్రకారం రాముడు త్రేతాయుగంలో జీవించాడు. మనం ఇప్పుడు జీవిస్తున్న కలియుగం క్రీస్తుపూర్వం 3-4 శతాబ్దాలలో ఆరంభం అయ్యింది. దానిని బట్టి వాల్మీకి రామాయణాన్నే ఆధారంగా తీసుకుంటే, రాముడు కలియుగ ప్రారంభానికి కొన్ని వేల ఏళ్ళ క్రితం జీవించి ఉండాలి. అయితే ప్రస్తుత అయోధ్య ప్రాంతంలో జరిగిన పరిశోధనల ప్రకారం అయోధ్యలో కేవలం క్రీస్తుపూర్వం 7-8 శతాబ్దాలనుంచే ప్రజలు నివశిస్తున్నట్లు తెలుస్తోంది.

క్రీస్తుశకం 300వ సంవత్సరానికి చెందిన "విష్ణుస్మృతి" గ్రంథం సుమారు 52 ప్రదేశాలను తీర్థయాత్రా స్థలాలుగా పేర్కొంది. ఇది తీర్థయాత్రా ప్రదేశాల అత్యంత పాతచిట్టా. దీనిలో అయోధ్య పేరు లేదు. 11వ శతాబ్దంలో వ్రాసిన "క్రీచ్య కల్పతరువు" ఉత్తర ప్రదేశ్‌లోని పలు తీర్థస్థలాలను పేర్కొంది. వీటిలో కూడా అయోధ్య పేరులేదు. బౌద్ధమత గ్రంథాలలో కోసల రాజ్యంలోని పెద్ద నగరాల లో "శ్రావసి", "సాకేత" లను పేర్కొన్నారు. కానీ, అయోధ్య ప్రస్తావన ఎక్కడా లేదు. జైన మత గ్రంధాల ప్రకారం అయోధ్య గంగానది ఒడ్డున ఉంది. కాగా, ఇప్పటి అయోధ్య "సరయూ"నది ఒడ్డున ఉంది.

చారిత్రిక ఆధారాల ప్రకారం క్రీస్తుశకం 5వ శతాబ్దిలో "స్కంధ గుప్తుడు" (విక్రమాదిత్యుడు) తన రాజధానిని సాకేతకు మార్చి అయోధ్య అని పేరు పెట్టాడు. అంటే ఇప్పటి అయోధ్యకు ఆ పేరు క్రీస్తు శకం 5వ శతాబ్దిలో మాత్రమే వచ్చిందనేది సుస్పష్టం. క్రీస్తుశకం 7వ శతాబ్ది తరువాత 13వ శతాబ్దం మధ్యలో వెలువడిన పలు గ్రంధాలలో అయోధ్య గురించిన ప్రస్తావన ఉంది. కానీ, వీటిలో ఎక్కడా అయోధ్యను రామపూజలకు కేంద్రంగా పేర్కొన లేదు. అయోధ్యకు రామపూజలకు కేంద్రంగా 13వ శతాబ్ది తరువాతే ప్రాచుర్యం లభించింది. 15, 16 శతాబ్దాల వరకు శైవ మతానిదే ప్రాబల్యంగా ఉంది. ఆ తరువాతి కాలంలోనే రామభక్తులైన రమానంద తెగవారు అయోధ్యలో పెద్దఎత్తున స్థిరపడ్డ దేవాలయా లను నిర్మించారు. ఇది చరిత్ర చెప్పిన సత్యం.

అయోధ్యలో రామజన్మభూమి స్థలంలో బాబరు గుడిని పడగొట్టి మసీదు కట్టించడానికి ఎలాంటి చారిత్రక ఆధారాలూ లేవు. బాబరు జ్ఞాపికలను కానీ, మసీదు వద్ద ఉన్న శిలాఫలకాలను కానీ పరిశీలించినట్లయితే ఇది స్పష్టమవుతుంది. అక్బరు కాలంలో రచించిన అయిన్-ఇ-అక్బరీలో కూడా గుడిస్థానంలో మసీదు కట్టించారన్న ప్రస్తావన లేదు. బాబరు 1598 సంవత్సరంలో గుడి పడగొట్టించి మసీదు కట్టారని హిందుత్వ సిద్ధాంతకర్తలు చెబుతున్నారు. ఆ కాలంలో రామ భక్తుడైన తులసీదాసు అయోధ్యలోనే జీవించాడు. అపుడాయన వయసు 30 ఏళ్ళు. అతడు "మ్లేచ్ఛుల" ప్రాభవాన్ని నిరశించాడు. అయితే, తులసీదాసు తన రచనలో ఎక్కడా అయోధ్యలో రామాలయం పడగొట్టి మసీదును కట్టినట్లు పేర్కొనలేదు. భారత పురావస్తు పరిశోధనా సంస్థ 1975వ సంవత్సరంలో జరిపిన రామాయణ ప్రదేశాల పురావస్తు పరిశోధన కూడా రామాయణ కాలంగా చెప్పబడుతున్న కాలానికి అయోధ్యలో అస్సలు జనసంచారమే లేదని తేల్చింది. అయోధ్యలో పురావస్తు పరిశోధనా సంస్థ త్రవ్వకాలు జరిపిన 14 ప్రదేశాలలో ఎక్కడా కూడా రాముని ప్రతిమలు లభించకపోవడం గమనార్హం.

అయితే, ఇవాళ రామజన్మభూమి వివాదాన్ని ముందుకు తెస్తున్న విశ్వహిందూ పరిషత్, ఆర్.ఎస్.ఎస్., బి.జె.పిలు "పఠానుల మీద దండయాత్ర జరిపేందుకు 1528వ సంవత్సరంలో బాబరు అయోధ్య మీదుగా వెళ్ళినట్లు" పేర్కొన్న జాన్ లెడెన్ అనే బ్రిటిష్ చరిత్రకారుని వాదననే అడ్డం పెట్టుకుంటున్నారు.

ఒకవేళ గుడిస్థానంలో బాబరు మసీదును నిర్మించి ఉంటే, 5 వందల సంవత్సరాల ప్రాచీనమైనదై ఉండాలి. కార్బన్ - 15 పరీక్ష ప్రకారం మసీదు 4 వందల సంవత్సరాలకంటే కూడా పురాతనమైనదిగా తేలటం కూడా హిందుత్వ వాదుల వాదనలలోని బూటకత్వాన్ని బైటపెడుతోంది.

మనకు అందుబాటులో ఉన్న అతి ప్రాచీన గ్రంథం "అయోధ్య మహాత్మ్యం" లో వ్రాసిన ప్రకారంగా రాముని జన్మస్థలం ప్రస్తుత వివాదాస్పద మసీదుకు ఆగ్నేయంగా కొంత దూరంలో ఉండేది. కాగా, అయోధ్యలోని 15 రామాలయాల పూజారులు కూడా నిజమైన రామజన్మస్థలం తమ దేవాలయమేనని చెబుతుంటారు. శ్రీషేర్‌సింగ్ అనే ఐ.ఏ.ఎస్. అధికారి జరిపిన పరిశోధనలో కూడా ప్రస్తుత బాబ్రీ మసీదు ప్రదేశం రామజన్మభూమి కాదని తేల్చారు.

మరి, చారిత్రక ఆధారాలు ఇలా ఉండగా ఈ మత వివాదం ఎలా ప్రారంభమైంది? దీనికి కారకులు ఎవరు? ఈ ప్రశ్నలకు జవాబు కోసం మనం 19వ శతాబ్దపు మధ్య కాలంలో బ్రిటిష్‌వారి పాత్రతో ప్రారంభించి, ఆ తరువాతి కాంగ్రెస్ పాలన, ఇప్పటి బి.జె.పి. ఆర్.ఎస్.ఎస్., విశ్వహిందూపరిషత్, ముస్లిం మతోన్మాదుల పాత్రలను పరిశీలించాల్సి ఉంది.

1857-58 సంవత్సరాలలో బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్య సంగ్రామం జరిగిన తరువాత భారతీయులను విభజించేందుకు బ్రిటిష్‌వారు రామజన్మభూమి - బాబ్రీ మసీదు వివాదాన్ని రేకెత్తించారని ప్రముఖ విద్యావేత్త శ్రీ సునీల్ శ్రీవాస్తవ తన పరిశోధనలో నిర్ధారించారు. ఫైజాబాద్ (అయోధ్య సమీపాన ఉంది) లో తమకు వ్యతిరేకంగా తిరుగుబాటు చెలరేగినపుడు తటస్థంగా ఉన్న భూస్వాములు, తమకు అండగా నిలచిన మహంత (పూజారులు) లకు బ్రిటిష్‌వారు పలు కానుకలు ఇచ్చారు. వీటిలో భాగంగానే బాబ్రీ మసీదుకు ఎదురుగా ఉన్న భూమిపై మహంతలకు హక్కులను కల్పించారు. దానితోపాటుగా రాముని జన్మస్థలం గుర్తుగా మసీదు ముందు ఒక నివేదిక పై "చబుత్ర" నిర్మించుకునేందుకు వారికి అవకాశం కల్పించారు. బాబ్రీ మసీదు - చబుత్రాలను వేరు చేసేందుకు ఒక కంచెను ఏర్పాటు చేశారు. అయితే, బ్రిటిష్‌వారు ఈ చర్యల ద్వారా స్థానిక ప్రజలలో మత విద్వేషాన్ని రేకెత్తించలేకపోయారు. అందుకే, ఈ ప్రయత్నం కొనసాగింపులో భాగంగా 1859వ సంవత్సరంలో ముస్లిములు మసీదు లోనికి ఉత్తరం వైపున ఉన్న ద్వారం గుండానే వెళ్లాలని బ్రిటిష్‌వారు ఓ ఉత్తర్వును జారీ చేశారు. విభజించి పాలించే తమ రాజనీతిలో భాగంగా బాబ్రీ మసీదు స్థలం అసలు రామజన్మభూమిదేననే వాదనను బ్రిటిష్‌వారు రెచ్చగొట్టారు. అయోధ్యలో మత సామరస్యాన్ని కాపాడేందుకు వివిధ మతాలకు చెందిన స్థానిక పెద్దలు చేసిన ప్రయత్నాలను అణచివేశారు. తదనంతరకాలంలో రామజన్మభూమి - బాబ్రీమసీదు వివాదం కేవలం చర్చలకే పరిమితమయ్యింది.

దేశ విభజన సందర్భంలో జరిగిన మత కల్లోలాలను ఆసరాగా తీసుకొని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ భారతదేశాన్ని "హిందూ రాష్ట్రం"గా మార్చాలనే తన ప్రయత్నాలను ప్రారంభించింది. అఖండ హిందూ రాష్ట్రం కావాలని, దేశంలోని ఇతర మతస్తులందరూ "హిందూత్వాన్ని" జీర్ణించుకోవాలని ఆర్.ఎస్.ఎస్. కోరింది. అయితే హిందూమతోన్మాది చేతిలో మహాత్మాగాంధీ మరణించడంతో ప్రజల మనోభావాలు ఆర్.ఎస్.ఎస్‌కు వ్యతిరేకంగా మరలాయి. దానితో ఆర్.ఎస్.ఎస్. నినాదాలు వెనుకపట్టుపట్టాయి.

అయితే, ఆర్.ఎస్.ఎస్. ఇంతటితో తన ప్రయత్నాలను విరమించుకోలేదు. భారత రాజకీయాలలో భాగం పంచుకునేందుకు భారతీయ జనసంఘ్ (ఇప్పటి భారతీయ జనతా పార్టీ) ని ఏర్పరచింది. ఈ ప్రయత్నానికి ఊతమిచ్చేందుకు, హిందువుల మనోభావాలను రెచ్చగొట్టేందుకు రామజన్మభూమి - బాబ్రీ మసీదు వివాదాన్ని త్రవ్వితీసింది. తమ సానుభూతిపరుడు, అప్పట్లో ఫైజాబాద్ జిల్లా కలెక్టర్ నాయర్ అనే అధికారి సహకారంతో 1949 డిసెంబర్ 22-23 తేదీలలో ఆర్.ఎస్.ఎస్ వారు సీత, రామ, లక్ష్మణుల విగ్రహాలను మసీదులో చేర్చారు. దానికి కావలసిన ఆధారం ఉంది. ఈ చర్యవలన మతసామరస్యానికి ప్రమాదం ఏర్పడింది. అయితే, సమస్య మరింత తీవ్రతరం కాకుండా ఆనాటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జోక్యం చేసుకున్నారు. ఆయన జోక్యం వలన వివాదాస్పదంగా మారిన స్థలానికి కోర్టువారు తాళాలు వేశారు. ఈ పరిస్థితి 1986వ సంవత్సరం ఫిబ్రవరి వరకు కొనసాగింది. ఈ మధ్యకాలమంతా రామజన్మభూమి - బాబ్రీ మసీదు ఎవరిదన్న వివాదం కోర్టులలో ఉండిపోయింది. అయితే, 1980వ దశకం మొదట్లో విశ్వహిందూ పరిషత్ రథయాత్ర, ఏకాత్మతా యజ్ఞాలను చేపట్టింది. ఈ సందర్భంలోనే పరిషత్ రామజన్మభూమి - బాబ్రీ మసీదు వివాదాన్ని తిరగదోడింది. అయినప్పటికీ ఈ సమస్య వారు ఆశించినంతటి వివాదంగా మారలేదు. అయితే, ప్రస్తుత సమస్య ఎలా వచ్చిందనేది ఇక్కడ ప్రశ్న. ప్రజల నుంచి ఓట్లను రాబట్టు కునేందుకు బూర్జువా పక్షాలు చేసిన ప్రయత్నాల ఫలితమే నేటి పరిస్థితి. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడచినా ప్రజల కనీస అవసరాలు తీర్చలేని ఈ పార్టీలు తమ దివాళాకోరుతనాన్ని కప్పి పుచ్చుకునేందుకు మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నాయి. బిజెపి, కాంగ్రెస్(ఐ)లది ఈ విషయంలో ముఖ్య బాధ్యత. 100 ఏళ్ళ బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ పబ్బంగడుపుకునేందుకు రగిల్చిన చిచ్చుకు వీరు ఆజ్యం పోస్తున్నారు.

షాబాను కేసులో తాను ముస్లిం మతోన్మాదులకు లొంగిపోయిన విషయం హిందువులలో అసంతృప్తి కలిగిస్తుందని భావించిన కాంగ్రెస్ (ఐ) ఈ విషయంలో తన బలహీనతను కప్పి పుచ్చుకునేందుకు రామజన్మభూమి - బాబ్రీ మసీదు వివాదాన్ని ఆసరాగా తీసుకుంది. కోర్టు తీర్పు ద్వారా రామజన్మభూమి - బాబ్రీ

మసీదు ప్రాంతపు తాళాలను తీసేందుకు నాటకమాడింది. ఈ నాటకానికి దూరదర్శన్‌లో విస్తృత ప్రచారం ఇచ్చుకుంది. రామజన్మ భూమి - బాబ్రీ మసీదు తాళాలు తీయాల్సిందిగా కోర్టు తీర్పునిచ్చిన 20 నిమిషాలలోనే వివాదాస్పద ప్రదేశంలో పూజలు జరిగిపోవడం ఈ కుట్ర స్వభావాన్ని వెల్లడిస్తోంది.

ఇదే సందర్భంలో కోర్టు తీర్పుద్వారా రామజన్మభూమి - బాబ్రీ మసీదులో పూజలకు అవకాశం పొందిన హిందూ సంస్థలు దేశంలో 150 ముస్లిం ప్రార్థనా ప్రదేశాలను విముక్తి చేయవలసిన ప్రాంతాలుగా చెప్పనారంభించాయి. ఇవన్నీ ఇదివరకు హిందూ దేవాలయాలేనని ప్రచారం ప్రారంభించాయి. వీటిలో కుతుబ్ మినార్, తాజ్‌మహల్, జుమ్మా మసీదు కూడా ఉన్నాయి. ఇది చాలదన్నట్లు మైనారిటీ కమీషన్‌ను రద్దు చేయాలని, జమ్మూకాశ్మీర్ రాష్ట్రానికి స్వయం ప్రతిపత్తి కల్పించే రాజ్యాంగంలోని 370వ అధికరణాన్ని తొలగించాలని ఆర్.ఎస్.ఎస్. నాయకులు కోరసాగారు. ఈ పరిణామాలన్నిటి పట్ల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వం రాజీ ధోరణి ప్రదర్శించింది. ఆ తరువాత పి.వి.నరసింహ రావు ప్రభుత్వం బాబ్రీ మసీదు కూల్చివేత తరుణంలో వచ్చి అవకాశ వాద విధానాన్ని అవలంబించింది.

ఈ సందర్భంగా 1949వ సంవత్సరంలో బాబ్రీ - రామజన్మ భూమి వివాదం తలెత్తినప్పుడు అప్పటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్, పండిట్ జి.బి. పంత్ (అప్పటి యునైటెడ్ ముఖ్యమంత్రి)కి రాసిన లేఖను ప్రస్తావించవచ్చు. ఆయన ఆ లేఖలో "ఇటువంటి విషయాలను ముస్లిం ప్రజల ఏకీభావం తీసుకుని శాంతియుతంగా మాత్రమే పరిష్కరించగలము. ఇటువంటి వివాదాలను బలప్రయోగం ద్వారా పరిష్కరించే ప్రశ్నే లేదు. బల ప్రయోగానికి ప్రయత్నం జరిగిన పక్షంలో శాంతి భద్రతల పరిరక్షకులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ అణచివేయాలి. లేదా వత్తిడులు తేవడంపై ఆధారపడ్డ ఏకపక్ష కార్యాచరణను మనం తిరస్కరించాలి" అన్నారు. పై చారిత్రక వాస్తవాల నేపథ్యంలో విహెచ్‌పి కోర్టు తీర్పు తనకు అనుకూలంగా లేకుంటే అంగీకరించ జాలమని చెప్పటం గమనార్హం. కఠోర వాస్తవాల పరీక్షకు తట్టుకుని నిలబడలేని వారెవరైనా క్షణానికో మాటమార్చి ప్రజలను గందరగోళ పరచటం ద్వారా మాత్రమే పబ్బం గడుపుకోగలుగుతారు. ❐

(11వ పేజీ తరువాయి)

మసీదు ప్రాంతపు తాళాలను తీసేందుకు నాటకమాడింది. ఈ నాటకానికి దూరదర్శన్‌లో విస్తృత ప్రచారం ఇచ్చుకుంది. రామజన్మ భూమి - బాబ్రీ మసీదు తాళాలు తీయాల్సిందిగా కోర్టు తీర్పునిచ్చిన 20 నిమిషాలలోనే వివాదాస్పద ప్రదేశంలో పూజలు జరిగిపోవడం ఈ కుట్ర స్వభావాన్ని వెల్లడిస్తోంది.

ఇదే సందర్భంలో కోర్టు తీర్పుద్వారా రామజన్మభూమి - బాబ్రీ మసీదులో పూజలకు అవకాశం పొందిన హిందూ సంస్థలు దేశంలో 150 ముస్లిం ప్రార్థనా ప్రదేశాలను విముక్తి చేయవలసిన ప్రాంతాలుగా చెప్పనారంభించాయి. ఇవన్నీ ఇదివరకు హిందూ దేవాలయాలేనని ప్రచారం ప్రారంభించాయి. వీటిలో కుతుబ్ మినార్, తాజ్‌మహల్, జుమ్మా మసీదు కూడా ఉన్నాయి. ఇది చాలదన్నట్లు మైనారిటీ కమీషన్‌ను రద్దు చేయాలని, జమ్మూకాశ్మీర్ రాష్ట్రానికి స్వయం ప్రతిపత్తి కల్పించే రాజ్యాంగంలోని 370వ అధికరణాన్ని తొలగించాలని ఆర్.ఎస్.ఎస్. నాయకులు కోరసాగారు. ఈ పరిణామాలన్నిటి పట్ల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వం రాజీ ధోరణి ప్రదర్శించింది. ఆ తరువాత పి.వి.నరసింహ రావు ప్రభుత్వం బాబ్రీ మసీదు కూల్చివేత తరుణంలో వచ్చి అవకాశ వాద విధానాన్ని అవలంబించింది.

ఈ సందర్భంగా 1949వ సంవత్సరంలో బాబ్రీ - రామజన్మ భూమి వివాదం తలెత్తినప్పుడు అప్పటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్, పండిట్ జి.బి. పంత్ (అప్పటి యునైటెడ్ ముఖ్యమంత్రి)కి రాసిన లేఖను ప్రస్తావించవచ్చు. ఆయన ఆ లేఖలో "ఇటువంటి విషయాలను ముస్లిం ప్రజల ఏకీభావం తీసుకుని శాంతియుతంగా మాత్రమే పరిష్కరించగలము. ఇటువంటి వివాదాలను బలప్రయోగం ద్వారా పరిష్కరించే ప్రశ్నే లేదు. బల ప్రయోగానికి ప్రయత్నం జరిగిన పక్షంలో శాంతి భద్రతల పరిరక్షకులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ అణచివేయాలి. లేదా వత్తిడులు తేవడంపై ఆధారపడ్డ ఏకపక్ష కార్యాచరణను మనం తిరస్కరించాలి" అన్నారు. పై చారిత్రక వాస్తవాల నేపథ్యంలో విహెచ్‌పి కోర్టు తీర్పు తనకు అనుకూలంగా లేకుంటే అంగీకరించ జాలమని చెప్పటం గమనార్హం. కఠోర వాస్తవాల పరీక్షకు తట్టుకుని నిలబడలేని వారెవరైనా క్షణానికో మాటమార్చి ప్రజలను గందరగోళ పరచటం ద్వారా మాత్రమే పబ్బం గడుపుకోగలుగుతారు. ❐

మీ ఆలోచనలకు అక్షరరూపాన్నివ్వండి

ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విషయాలపై ఆలోచనాత్మక విశ్లేషణలతో కూడిన, వ్యాస రచనల్ని సమీక్ష ఆహ్వానిస్తుంది.

మీరు రచనలు పంపాల్సిన చిరునామా :

వి. హనుమంతరావు
సమతా పబ్లికేషన్స్,
ఇం.నెం. 8-3-898/22, రోడ్ నెం. 3, నాగార్జున నగర్, హైదరాబాద్ - 500 073.